J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 31.01.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 35 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



ఎన్టీఆర్‌లోని ధీరత్వం





వైయస్‌లోని మానవత్వం..

## సంచలనాలు.. జగన్ సాహసాలు!

- శాసన మండలి రద్దు చరిత్రాత్మకం

**ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో సాహస నిర్ణయాలకు స్వర్గీయ నందమూరి తారకరామారావు పెట్టింది పేరైతే, గుండెలను హత్తుకునే మానవతా పథకాల రూపశిల్పి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి. శాసనమండలిని రద్దు చేసినా, అసెంబ్లీని రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు పోయినా, ఒకేసారి 28మంది మంత్రివర్గ సభ్యులను తన మంత్రివర్గం నుండి తొలగించినా అది ఎన్టీఆర్‌కే చెల్లింది. ఇక ఆరోగ్యశ్రీ వంటి పథకంతో పేదల ఇంట ఆరోగ్యదీపాలు వెలిగించినా, ఫీజు రీయంబర్స్‌మెంట్‌తో ప్రతి నిరుద్యోగి ఇంట జీవనజ్యోతి వెలిగించినా ఆ ఖ్యాతి వైయస్సార్‌దే! ఇప్పుడు వైయస్ జగన్ పాలన అటు ఎన్టీఆర్‌లోని సాహస నిర్ణయాలను, ఇటు వైయస్ చూపిన మానవతా కోణాన్ని జోడెద్దులుగా చేసుకుని పరిపాలనా బండిని ముందుకు పరుగెత్తిస్తుండడం విశేషం.**

మేధావులను, వివిధ రంగాలలో అనుభవజ్ఞులను మంత్రివర్గంలోకి తీసుకోవడానికి రాష్ట్రస్థాయిలో ఏర్పరచుకున్న వేదిక శాసన మండలి. భారత రాజ్యాంగంలో ఇది తప్పనిసరిగా వుండాలి అని పేర్కొనకపోయినప్పటికీ ఆయా రాష్ట్రాలలోని ప్రభుత్వాలు తమ సౌలభ్యాన్ని, అవసరాన్ని బట్టి శాసనమండలులను ఏర్పాటు చేసుకోవడం, లేదా రద్దు చేయడం వంటివి చేస్తూ వస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలోనూ శాసనమండలికి ఒక ప్రత్యేక స్థానం వుంది. ఎందరో మేధావులు, విద్యావేత్తలు, వివిధ రంగాలకు చెందిన అనుభవజ్ఞులు, ఆర్థికవేత్తలు ఈ శాసనమండలి నుండే సభ్యులుగా పనిచేశారు. వారిలో కొందరు మంత్రులుగా కూడా సేవలందించారు. శాసన మండలి అప్పుడప్పుడు రద్దయినప్పటికీ, అది పని చేసిన కాలంలో మాత్రం దాని విలువ, గౌరవాన్ని ఎవరూ దిగజార్చలేదు.

కాని, ప్రతిపక్ష నేత, తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు పుణ్యమా అని శాసనమండలిపై తొలిసారిగా ఒక వ్యతిరేక అభిప్రాయం వచ్చింది. ఇలాంటి శాసనమండలి రాష్ట్రానికి అవసరమా? అనే ప్రశ్న ఉదయించింది. ఆ ప్రశ్నకు జవాబుగా రాష్ట్ర ప్రభుత్వం శాసనమండలి రద్దు వైపు మొగ్గు చూపింది. దీంతో శాసనమండలి రద్దును ప్రతిపాదిస్తూ శాసనసభలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశపెట్టడం, 133–0 ఓట్ల తేడాతో అది ఆమోదం పొందడం జరిగాయి. ఇక ఈ తీర్మానాన్ని పార్లమెంటు ఆమోదించి, రాష్ట్రపతి ముద్ర పడితే అక్కడితో శాసనమండలి కథ ముగిసినట్లే!

### చంద్రబాబు వైఖరే కారణమా?

శాసనమండలిని ఉన్నఫళంగా రద్దు చేయాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం వెనుక ప్రతిపక్ష నేత చంద్రబాబు అవలంభించిన అప్రజాస్వామిక వైఖరే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అభివృద్ధిని వికేంద్రీకరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానుల అంశాన్ని తెరమీదకు తెచ్చింది. విశాఖపట్నంలో పరిపాలన రాజధాని, అమరావతిని చట్టసభల రాజధానిగా, కర్నూలును న్యాయపాలన రాజధానిగా ప్రకటించింది. ఈమేరకు అభివృద్ధి వికేంద్రీకరణ, సిఆర్‌డిఏ రద్దు బిల్లులను శాసన సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది. ఆ బిల్లును శాసనమండలి ఆమోదానికి పంపారు.

అయితే, ఇక్కడే చంద్రబాబు తన అతి తెలివి తేటలు చూపించాడు. 8 నెలల క్రితం వరకు రాష్ట్రంలో అధికారంలో వున్నది తెలుగు దేశమే! కాబట్టి శాసనమండలిలో సహజంగానే ఆ పార్టీకి బలముంటుంది. మండలి ఛైర్మెన్ కూడా

(మిగతా 11వ పేజీలో)

## నెల్లూరు రెడ్‌క్రాస్‌లో ఘరానా దొంగలు

# కళ్ళు కప్పి.. కోట్లు దోచేసుకుంటున్నారు






### ఆడిటర్లతో కుమ్మక్కు, మేనేజర్‌లతో లాలూచీ

### చిల్లర(ఇతర) ఖర్చుల పేరుతో కోట్ల దోపిడీ

### జీతాలు, గౌరవ వేతనాలు అంటూ కోట్లకు రెక్కలు

### కన్సల్టెన్సీల ఖర్చు అని చెప్పి లక్షలు మింగుతున్నారు

*పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు మనసున్న మంచి దాతల సహాయంతో సేవలందించడానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రారంభించబడిన రెడ్‌క్రాస్ సంస్థ నెల్లూరు విభాగం కొందరు దొంగలకు నిలయంగా మారిపోయింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నడవవలసిన ఈ సంస్థపై జిల్లా యంత్రాంగం సరిగ్గా దృష్టి పెట్టకపోవడంతో పెద్దమనుషులమని చెప్పుకునే కొందరు ఘరానా మోసగాళ్ళకు ఇప్పుడు "రెడ్‌క్రాస్" అడ్డాగా తయారయ్యింది. రెడ్‌క్రాస్ అనుబంధ సంస్థలుగా వున్న వివిధ విభాగాలలో దొరికినంత దోచుకుందాం.. పంచుకుని దాచుకుందాం.. అన్న సిద్ధాంతంతో కాకిలెక్కలు చూపించి కాకమ్మ కబుర్లు చెప్పేస్తున్నారు.*

*ఇక్కడ జరిగిన, జరుగుతున్న అన్యాయాలను అక్రమాలను ఎవరైనా ప్రశ్నిస్తే తమ పలుకుబడిని ఉపయోగించి, ప్రశ్నించినవారి సన్నిహితులతో వారి నోరు మూయించి దర్జాగా తమ దోపిడీని కొనసాగిస్తున్నారీ ఘనులు. జీతాలు, గౌరవ వేతనాలంటూ ఏడాదికి కోట్ల రూపాయల ఖర్చును చూపిస్తున్నారు. చిల్లర(ఇతర) ఖర్చులు అంటూ కోట్లు కాజేస్తున్నారు. తమను అడిగే నాధుడు లేదన్న ధీమాతో ఎక్కడికక్కడ తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ దాతల ధనాన్ని మింగేస్తున్నారు.*

ఫిబ్రవరి 2వ తేదీ రెడ్‌క్రాస్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్ 8వ తేదీన ఓసారి, మళ్ళీ జనవరి 5వ తేదీన మరోసారి వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశాలలో ప్రస్తుతం పనిచేస్తున్న మేనేజింగ్ కమిటీ సభ్యులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు ఇచ్చిన లెక్కలు చూస్తే పక్కా దోపిడీకి వారు రచించుకున్న పథకాన్ని గమనిస్తే.. ఎవరికైనా సరే కళ్ళు బైర్లు కమ్ముతాయి.

**1. బ్లడ్‌బ్యాంక్ మెయింటెనెన్స్:** 2017–18లో 1కోటి 29 లక్షల 53వేల రూపాయలు ఖర్చు చేస్తే, 2018–19లో 1కోటి 14లక్షల5వేల రూపాయలు ఖర్చు చేశారు. బ్లడ్‌బ్యాంక్ మెయింటెనెన్స్ 2 సంవత్సరాలకు కలిపి 2,43,58,000/– అంటే సుమారుగా నెలకు 10,14,000/– రూపాయలు ఖర్చు చేస్తున్నారు. మెయింటెనెన్స్‌కు నెలకు ఇన్ని లక్షలు అవుతుందా..?

**2. పరికరాల మెయింటెనెన్స్:** 2017–18లో 5లక్షలా 99వేల రూపాయలు ఖర్చుచేస్తే, 2018–19లో 2లక్షల 10వేల రూపాయలు ఖర్చుగా చూపించారు. 16–17లో అయితే ఇది 31 లక్షల 27వేల రూపాయలుగా పేర్కొన్నారు.

బ్లడ్‌బ్యాంక్ మెయింటెనెన్స్‌తో సంబంధం లేకుండా మళ్ళీ పరికరాల

(మిగతా 12వ పేజీలో)

### పల్లెప్రజలకు సులభతరంగా..

# తపాలాశాఖలో బ్యాంకింగ్ సేవలు

### ఐపిపిబి కార్డుతో ఎన్నో ఉపయోగాలు

పల్లెప్రజలకు సులభతరంగా బ్యాంకింగ్ సేవలు అందించేందుకు తపాలాశాఖ కృషి చేస్తోంది. నగదు కోసం మండల కేంద్రాలకు, సమీప పట్టణ ప్రాంతాల్లోని బ్యాంకులకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా సొంత గ్రామంలోనే బ్యాంకులు అందించే అన్ని సేవలను తపాలాశాఖ అందుబాటులోకి తీసుకురావడం విశేషం. నగదు బదిలీ, ఉపాధి హామీ చెల్లింపులు, గ్యాస్ రాయితీ, మత్స్యకారులకు అందే రాయితీనిధులు, రైతు భరోసా, అమ్మఒడి వంటి ప్రభుత్వ పథకాల లబ్ధిని తపాలాశాఖ పంపిణీ చేసిన కార్డు ద్వారా పొందే అవకాశం కల్పించారు. మొబైల్ బ్యాంకింగ్ సేవ ద్వారా చెల్లింపులు చేసుకునే వెసులుబాటు కూడా దీనివల్ల కలుగుతుంది. 100 రూపాయల చెల్లింపుతో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు (ఐపిపిబి) ఖాతాను ప్రారంభించవచ్చు. ఈ ఖాతాను యాప్ ద్వారా పొందడానికి అవకాశం ఉంది. వివరాలు నమోదు చేసిన వెంటనే కార్డు అందజేస్తారు. దీనికి ఎలాంటి పాస్‌పుస్తకం కూడా అవసరం లేదు. ఈ తపాలా కార్డుల వల్ల బహుళ ప్రయోజనాలు ఉండడంతో ఎక్కువమంది దీనిపట్ల ఆసక్తి చూపుతున్నారని తెలుస్తోంది.

# నిరుద్యోగ యువతకు సీపెట్ కేంద్రం

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు నెల్లూరు జిల్లా నాయుడుపేట కేంద్రంగా సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకుగాను 50ఎకరాల స్థలం చూపించాలని ఏపీఐఐసీకి ఐఐఐసీడీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో మరో సీపెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర రసాయన, పెట్రోలియం శాఖామంత్రి సదానందగౌడకు విజ్ఞప్తి చేసిన మేరకు ఆయన స్పందించి దీన్ని మంజూరు చేశారు. నాయుడుపేట కేంద్రంగా ఏర్పాటుకు 50ఎకరాల స్థలాన్ని ఏపీఐఐసీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ కేంద్రంలో పదవతరగతి. ఇంటర్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ప్లాస్టిక్ ఇంజినీరింగ్‌లో డిప్లొమో, బీటెక్ కోర్సులు చేసి ఉపాధి పొందే అవకాశం వుంది. దాదాపు రూ.50 కోట్లతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు.

# అన్యమత ప్రచారాలకు ప్రభుత్వ ప్రోత్సాహం

### - బీజేపీ నేతల విమర్శ

రాష్ట్రంలో అన్యమత ప్రచారాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని బీజేపీ, విహెచ్‌పి నాయకులు ఆరోపించారు. నెల్లూరు, స్వర్ణాలచెరువులో మహాశివలింగాన్ని ప్రతిష్ఠించాలని కోరుతూ బుధవారం గాంధీబొమ్మ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మిడతల రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఓట్ల బ్యాంకు రాజకీయాలకు లొంగి స్వర్ణాల చెరువులో శివలింగాన్ని ప్రతిష్ఠించకపోవడం శోచనీయమన్నారు. ఆలయాల భూములను అన్యమతాల వారికి అప్పగించే చర్యలను ఆయన ఖండించాడు. ప్రజల పన్నులను పాస్టర్లకు జీతాలుగా చెల్లిస్తుండడంతో కొన్ని వందల కొత్త చర్చిలు నిర్మాణంలో వున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో హిందూ సంస్కృతిపై దాడులు పెరిగాయని, హిందూ ధార్మికతను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించాడు.

ఈ కార్యక్రమంలో విహెచ్‌పి జిల్లా కార్యదర్శి మిద్దె శ్రీనివాసరావు, దేగా మల్లారెడ్డి, ఏవిఆర్ మోహన్‌రావు, రాజేంద్ర, పి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### బాపూజీ ఆశయాలు..

# మానవాళికి ఆదర్శం



పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో మాట్లాడుతున్న గంగిశెట్టి శివకుమార్

సత్యాన్వేషణే పూజ్యబాపూజీకి అన్ని విజయాలను చేకూర్చిపెట్టిందని, దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు సత్యాన్వేషణతోనే గాంధీజీ జీవితం ప్రారంభించారని, బాపూజీ ఆశయాలు ప్రపంచ మానవాళికి ఎంతో ఆదర్శనీయమైనవని ప్రముఖ రచయిత, బాలసాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్ అన్నారు. ఈనెల 29న ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులో ఉన్న గాంధీజీ ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 'గాంధీతత్వం'పై ఉపన్యసించారు. సత్యం, సహనం, పట్టుదల ఉంటే ఎంత పెద్ద కార్యాన్నయినా సాధించుకోవచ్చని బాపూజీ నిరూపించారన్నారు. అనంతరం గంగిశెట్టి శివకుమార్‌ను కార్యక్రమ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. గాంధీ ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సభ్యులు ఆర్.శివరామయ్య, మేనేజర్ రామయ్యతో పాటు డైట్ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### నగర పంచాయితీ...

# వింజమూరుకు రైట్ రైట్



ఉదయగిరి నియోజకవర్గంలో పెద్దపట్టణంగా, మేజర్ పంచాయితీగా వున్న వింజమూరును నగర పంచాయితీగా మార్చడానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆమోదించినట్లు తెలుస్తోంది. ఈమేరకు ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటన చేశాడు. జిల్లాలో 9 మేజర్ పంచాయితీలను నగర పంచాయితీలుగా ప్రతిపాదించగా, చివరకు వాటిలో నాలుగు మాత్రమే మిగిలాయి. కాని, ఇటీవల చూస్తే బుచ్చిరెడ్డిపాలెం ఒక్క దానికే ప్రభుత్వం నుండి నగర పంచాయితీగా ఆమోదం లభించింది. మిగతా వాటికి ఈసారి పంచాయితీ ఎన్నికలు తప్పవు అనుకున్న తరుణంలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వింజమూరును నగర పంచాయితీగా మార్పు చేయడానికి ముఖ్యమంత్రి స్థాయిలో తీవ్రంగా ప్రయత్నించి సఫలమయ్యాడు.

మెట్ట ప్రాంతంలో పెద్ద పట్టణం వింజమూరు. పంచాయితీ జనాభానే 30వేలు దాటింది. చుట్టుపక్కల చాలా గ్రామాలు వింజమూరు పరిధిలోకి వస్తున్నాయి. విద్య, వ్యాపారాల పరంగా పట్టణం శరవేగంగా విస్తరిస్తోంది. చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చి వింజమూరులో స్థిరపడుతున్న వాళ్ళు పెరుగుతున్నారు. ఈ దృష్ట్యా వింజమూరును నగర పంచాయితీగా మార్పు చేస్తే మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశముంది.

సింహపురి సమాచారం

### కార్పొరేషన్ నుండి..

# పొట్టేపాళెంకు విముక్తి

### మళ్ళీ గ్రామ పంచాయితీగానే...

నెల్లూరు నగరపాలక సంస్థ 38వ డివిజన్ పరిధిలోని పొట్టేపాళెం గ్రామంకు నగర పాలకసంస్థ నుండి విముక్తి లభించింది. పొట్టేపాళెంను గ్రామ పంచాయితీగానే గుర్తిస్తూ ప్రభుత్వం గెజిట్ నోట్ విడుదల చేసింది. దీంతో పొట్టేపాళెంలో ఇక కార్పొరేషన్ ఎన్నికలకు బదులు పంచాయితీ ఎన్నికలే జరుగనున్నాయి.

2013లో నెల్లూరురూరల్ మండలం పరిధిలోని 15 పంచాయితీలను నగర పాలక సంస్థలో విలీనం చేశారు. అయితే 14 పంచాయితీలు విలీనానికి ఒప్పుకోగా, పొట్టేపాళెం పంచాయితీ ఆనాటి పాలకవర్గం మాత్రం ఒప్పుకోలేదు. ఉపసర్పంచ్ పల్లంరెడ్డి ఆనందసుధ ఆధ్వర్యంలో విలీనాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. అయినా కూడా 2014లో జరిగిన నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో పొట్టేపాళెంను 38వ డివిజన్‌లో కలిపి ఎన్నికలు పెట్టారు. అయినా కూడా గత పంచాయితీ పాలకవర్గం పట్టువిడవకుండా పోరాడింది. ఏడేళ్లుగా వాళ్ళు న్యాయస్థానంలో పోరాడారు. గత ఏడాది మార్చిలో హైకోర్టు పొట్టేపాళెంను గ్రామ పంచాయితీగానే వుంచాలని ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. ఈమేరకు ప్రభుత్వం కూడా పొట్టేపాళెంను కార్పొరేషన్ నుండి విడదీసి, పంచాయితీగానే కొనసాగిస్తూ గెజిట్‌నోట్ విడుదల చేసింది.

# సమ్మె బాటలో బ్యాంకు ఉద్యోగులు

### - రెండు రోజులు కొనసాగనున్న ఆందోళన

బ్యాంకు అధికారులు, ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 31న, ఫిబ్రవరి 1న రెండురోజుల పాటు బ్యాంకు ఉద్యోగులు సమ్మెకు సమాయత్తమవుతున్నారు. భారతీయ బ్యాంకుల సంఘంతో ఇటీవల జరిపిన చర్చలు సఫలం కాకపోవడంతో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ సమ్మెకు పిలుపునిచ్చింది. వేతనాల పెంపు 15 శాతం ఉండాలని, బ్యాంకులకు సంబంధించిన అనేక సమస్యలను ఇకనైనా వెంటనే పరిష్కరించాలని యూనియన్ల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# 50 ఏళ్ళ తర్వాత అపురూప కలయిక

ప్రస్తుతం వారి వయస్సు 60 ఏళ్ళు పై మాటే. దశాబ్దాల తర్వాత మళ్ళీ పాత స్నేహితులంతా ఒక దగ్గర కలవాలని నిర్ణయించుకున్నారు. వెంటనే ఒకరికొకరు సమాచారం అందించుకున్నారు. అలా అందరూ ఒక చోటకు చేరారు. నెల్లూరు స్టోన్ హౌస్ పేట తడికల బజార్ ప్రాంతంలోని ఆర్‌ఎస్‌ఆర్ ఉన్నత పాఠశాలలో 1970లో పదవతరగతి చదివిన వారంతా కొందరు ప్రభుత్వ ఉద్యోగాల్లో వివిధ హోదాలు దక్కించుకుంటే, మరికొందరు వ్యాపారాల్లో రాణించారు. 50 ఏళ్ళ తర్వాత ఈనెల25న నెల్లూరు మెక్లీన్స్ క్లబ్ లో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, కర్నూల్, చెన్నై తదితర ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులంతా మొదటిసారిగా ఒక్కచోటకు చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విక్రమ సింహపురి యూనివర్శిటీ ఉపకులపతి సుదర్శన్‌రావు పాల్గొని మాట్లాడుతూ రక్త సంబంధం కంటే ఎక్కువ ఆత్మీయత, అనుబంధాలను తరగతి గది ఏర్పరుస్తుందన్నారు. పూర్వ విద్యార్థులు తమకు విద్య నేర్పిన గురువు శ్రీనివాసరావును సత్కరించారు. నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి రాజేంద్రప్రసాద్, బ్రహ్మంగుప్తా, బాబూరావు, డాక్టర్లు నారాయణ రెడ్డి, పెంచలయ్య, ధనరాజ్, సుబ్రహ్మణ్యం, హైకోర్టు న్యాయవాది విజయకుమార్, విశ్రాంత శాస్త్రవేత్త కృష్ణయ్య, విశ్రాంత తహసీల్దార్ భాస్కర్, దేవదాయ శాఖ విశ్రాంత అధికారులు యానాదిశెట్టి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


# సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



తులసి మొక్కను నాటుతున్న డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, రోహిణి తదితరులు

గూడూరు పట్టణం సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ దత్తసాయి మందిరంలో సాయి బాబా విగ్రహ ప్రతిష్ఠను సోమవారం ఘనంగా నిర్వహించారు. బాబాకి కుంభాభిషేకం, అభిషేకాలు, అర్చనలు, హారతులు, అష్టోత్తర శతనామావళి పూజలు, తదితర పూజా కార్యక్రమాలు పండితులు వేద మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి తులసి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జీవనరెడ్డి, ప్రభారెడ్డి, సాయి సేవకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బ్యాగులు



బ్యాగులను అందిస్తున్న సులేఖ, జాన్‌ప్రభాకర్

గూడూరు పట్టణంలోని ఎస్ఎంజి పాఠశాలలో విన్‌క్రిష్ నాలెడ్జ్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, బ్యాగులను ఇటీవల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. సమాజంలో చదువుతోనే తగిన గుర్తింపు గౌరవం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జాన్‌ప్రభాకర్, డాక్టర్ నిత్యప్రశాంతి, అపురూప్, సాయి, మేరీ తదితరులు పాల్గొన్నారు.



## ఆములూరమ్మ తల్లి దేవస్థానంలో
# 14న మహాకుంభాభిషేకం
### శ్రీ శంకరవిజయేంద్ర శంకరాచార్యస్వామి దివ్యాశీస్సులతో నూతన విగ్రహ ప్రతిష్టాపన



తోటపల్లి గూడూరు మండలంలోని సౌత్ ఆములూరు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఆములూరమ్మ తల్లి దేవస్థానంలో ఫిబ్రవరి 12 నుంచి 14వ తేది వరకు నూతన విగ్రహ ప్రతిష్టా మహాకుంభాభిషేక మహోత్సవాలు జరుగనున్నాయి. జగద్గురు శ్రీ కంచికామకోటి పీఠాధిపతులు పూజ్యశ్రీ శంకర విజయేంద్ర శంకరాచార్యస్వామి వారి దివ్యాశీస్సులతో, స్వామివారి చేతులమీదుగా ఈ కార్యక్రమం నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. సౌత్ ఆములూరులో నూతనంగా పునర్నిర్మాణం గావించిన దేవస్థానంలో శ్రీ అములూరమ్మ తల్లి, విమాన శిఖరం, పోతురాజుస్వామి, సింహవాహనం, బలిపీఠం, నూతన విగ్రహ ప్రతిష్టా మహాకుంభాభిషేకం కార్యక్రమాలు త్రయాహ్నిక దీక్షతో శైవాగమానుసారంగా వైభవోపేతంగా జరుగనున్నాయి. ఈనెల 14వ తేది ఉదయం 9.45 నుంచి 11.31 లోగా స్వాతి నక్షత్రయుక్త మేష లగ్నం శుభముహూర్తంలో నూతన విగ్రహ ప్రతిష్టా మహా కుంభాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తొలుత ఫిబ్రవరి 12వతేది ఉదయం 9గంటల నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. ఉదయం 11.30 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం నేత్రపర్వంగా నిర్వహించనున్నారు. 13న ఉదయం 8 నుండి సాయంత్రం వరకు విశిష్టపూజలు, హోమాలు నిర్వహిస్తారు. ఇదేరోజు సాయంత్రం 6 గంటలకు ప్రధాన కలశ స్థాపన కార్యక్రమం ఉంటుంది. 14వ తేదీన శ్రీ శ్రీశంకర విజయేంద్ర శంకరాచార్యస్వామీజీ విచ్చేసి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేసి నూతన విగ్రహప్రతిష్ట చేయనున్నారు. ఈ సందర్భంగా 12వ తేదీ నుంచి ఆములూరమ్మ తల్లి అమ్మవారికి విశిష్టపూజలు జరుగుతాయని, ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి అమ్మవారి కృపా కటాక్షానికి పాత్రులు కావాలని ఆలయ నిర్మాణ దాత, ప్రముఖ వదాన్యులు నంబూరు మోహన్‌రావు కోరారు.

## విపిఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో...
# విద్యార్థులకు 'బెడ్ కిట్స్' పంపిణీ

నెల్లూరు రూరల్ మండలంలోని కనుపర్తిపాడులో ఉన్న 'విపిఆర్ విద్య'లో రాజ్యసభ సభ్యులు, విపిఆర్ ఫౌండేషన్ ఫౌండర్ ఛైర్మెన్ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కెనడాకు చెందిన ఎస్‌సిఏడబ్ల్యు (స్లీపింగ్ చిల్డ్రన్ అరౌండ్ ది వరల్డ్) సంస్థ సభ్యులు, తమిళనాడులోని అంబత్తూరు రోటరీక్లబ్ వారి భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బెడ్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా టిటిడి బోర్డు సభ్యురాలు, విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఇలాగే చిన్నారులకు బెడ్ కిట్స్ అందజేస్తున్నామన్నారు. జిల్లాలోని బోగోలు, దగదర్తి, కోవూరు, బుచ్చి, సంగం, ఏఎస్ పేట, నెల్లూరు, నెల్లూరు రూరల్ మండలాలకు చెందిన 30 ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి చదువుతున్న 500 మంది విద్యార్థులకు బెడ్ కిట్స్ అందజేశామని, ఈ కార్యక్రమం తమకెంతో సంతోషం కలిగిస్తోందని అన్నారు. ఒక్కొక్కటి 5 వేలు విలువజేసే ఈ కిట్స్‌లో దోమతెర, జంఖానా, దుప్పట్లు, దిండు కవర్లు, పరుపు, రెయిన్‌కోట్, స్కూల్‌బ్యాగ్, నోట్ బుక్స్ వుంటాయని అన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని ప్రారంభించిన కెనడాకు చెందిన స్వర్గీయ ముర్రే డ్రైడన్‌ను అందరం స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఏడబ్ల్యు సభ్యులు థెరేసా కర్రావెట్ట, చెరైల్ వార్నర్, కేథరీన్ వెస్ట్ బ్రూక్, మేరీ పార్లమెంట్, జేమ్స్ ఫ్లాదర్, స్టీవెన్ జెఫ్రేరీ, నాన్సీ ఓ డొన్నె జెఫ్రిరి, రామ్‌దాస్, విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ. నారాయణరెడ్డి, విపిఆర్ విద్య ప్రిన్సిపల్ శ్రీనివాస్, విపిఆర్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులతో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మరియు ఎస్‌సిఏడబ్ల్యు ప్రతినిధులు

## నగరంలో నరకాన్ని తలపించే...
# ట్రాఫిక్‌పై దృష్టి పెట్టిన అనిల్



నెల్లూరు నగర ప్రజలకు అతిపెద్ద పజిల్ ట్రాఫిక్. సర్కస్‌లో సైకిల్ తొక్కడం సులభంగా వుంటుందేమోగాని, నగర రోడ్లపై వున్న ట్రాఫిక్‌లో వాహనం నడపడం మాత్రం చాలా కష్టం. అంత భయంకరమైన ట్రాఫిక్ వుంటుంది. ఎవరెన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నా ఈ ట్రాఫిక్‌ను మాత్రం దారికి తేలేకపోతున్నారు.

నెల్లూరు నగర ట్రాఫిక్‌ను దారికి తేవడానికి నగర ఎమ్మెల్యేగా తన బాధ్యతగా మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ కూడా ప్రయత్నాలు మొదలుపెట్టారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై బుధవారం నెల్లూరులోని ఇరిగేషన్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిరావు, ఎస్పీ భాస్కర్ భూషణ్, డిఆర్ఓ మల్లికార్జున్, నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి, టిడిసి సుబ్బారావులతో సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై దృష్టి పెట్టాలని ఆయన అధికారులను ఆదేశించాడు. ఈ సందర్భంగా అధికారులు కూడా పలు సూచనలు చేశారు. ఇందులో నగరం నడిబొడ్డులో వున్న ఆర్టీసీ బస్టాండ్‌ను మార్చడం ఒకటి. ఆర్టీసీ వల్లే నగరంలో సగం ట్రాఫిక్ వుంటుంది. ఆర్టీసీని హైవేకు దగ్గరగా మారిస్తే ట్రంకురోడ్డుపై సగం ట్రాఫిక్ తగ్గుతుందని వివరించారు. అలాగే గ్రామాల నుండి వచ్చే ఆటోలను నగర శివార్ల వరకే అనుమతించడం, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను మినీబైపాస్‌రోడ్డులో కాకుండా చిల్డ్రన్స్‌పార్క్‌రోడ్డులో హైవేకు దగ్గరగా నిలిపేలా చేయడం, ఇసుక ట్రాక్టర్లను నగరంలోకి రాత్రి వేళల్లోనే అనుమతించడం వంటి చర్యల ద్వారా ట్రాఫిక్ భారాన్ని కొంతవరకు తగ్గించవచ్చని సూచించారు.

# జై.. జగన్నాథ్..
### అంగరంగ.. వైభవంగా శ్రీ జగన్నాథ రథయాత్ర..



అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) మందిరం ఆధ్వర్యంలో ఈనెల 29 న శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై బలరామ సుభద్ర, శ్రీకృష్ణ పరమాత్మ, శ్రీలప్రభుపాద స్వామి వార్లను ప్రతిష్టించారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షులు డాక్టర్ సుకదేవస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నెల్లూరు నగరం ట్రంకురోడ్డు ఏసీ సెంటర్ నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోలు బంకు, మాగుంట లేఅవుట్ లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం మీదుగా మినీబైపాస్‌లోని పివిఆర్ కళ్యాణ మండపం వద్దకు చేరుకుంది. ఈ రథయాత్రలో భక్తులు హరేరామా.. హరేకృష్ణ నామస్మరణలతో, భజనలు చేస్తూ, పాటలు పాడుతూ భక్తి పారవశ్యంతో పులకించి పోయారు. కొందరు భక్తులు నగర వీధుల్లో కోలాటాలు, నృత్యాలు చేస్తూ అందరిని ఆకట్టుకున్నారు.

రాజ్యసభ సభ్యుడు ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సౌజన్యంతో కొన్నేళ్ళుగా జగన్నాథుని రథయాత్ర సింహపురిలో దివ్యంగా సాగుతోందని డాక్టర్ సుకదేవస్వామి వివరించారు. జగన్నాథుని రథయాత్రకు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ నారాయణరెడ్డి, అఖిలేశ్వర దాస్(కెనడా), ఇస్కాన్ మందిరాల నిర్వాహకులు నందగోపాల్ దాస్ (వరంగల్), జయగోపినాథ్ దాస్ (చెన్నై), మహాశృంగ దాస్ (సికింద్రాబాద్), రఘుచంద్రదాస్ (చీరాల) జగన్నాథుడి రథయాత్ర విశేషాలను వివరిస్తూ ఉపన్యసించారు. ఈ సందర్భంగా భగవద్దర్శన్ పుస్తకాన్ని, టీ షర్టులను, అహోబిలం మఠం వ్యవసాయ క్షేత్రాల్లో ఎటువంటి రసాయనాలు వాడని ఉత్పత్తుల నుంచి తయారు చేసిన వివిధ పిండి వంటకాలను, తినుబండారాలను ఆవిష్కరించారు.

# శ్రీసిటీలో మరో ప్రముఖ విద్యాసంస్థ
### అకార్డ్ సిబిఎస్ఇ స్కూల్‌కు భూమిపూజ

తిరుపతిలోని ప్రముఖ విద్యాసంస్థ అకార్డ్ తమ మరో స్కూల్ క్యాంపస్‌ను శ్రీసిటీలో ఏర్పాటు చేయనుంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇక్కడ అడ్మిషన్లు కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 27న అకార్డ్ స్కూల్ ఛైర్మెన్ వి.చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సమక్షంలో స్కూల్ డైరెక్టర్లు వి.ప్రశాంత్, వి. వివేక్‌లు ఆ స్కూల్ భవనాలకు భూమి పూజ చేశారు. స్కూల్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సురక్షితమైన మంచి వాతావరణంలో పిల్లల విద్యాబోధనలకు ఇక్కడ ఎంతో అనువైన రీతిలో 10 ఎకరాల గ్రీన్ క్యాంపస్‌గా స్కూల్ నిర్మాణం చేపడతామన్నారు. సమర్థవంతమైన అధ్యాపక బృందంతో ఇక్కడ విద్యార్థులు ఎంతో క్రమశిక్షణతో విద్యను అభ్యసించే అవకాశం ఉంటుందన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ వర్క్-లివ్-లెర్న్-ప్లే అనే సూత్రంతో శ్రీసిటీ నిర్మాణం జరిగిందన్నారు. అకార్డ్ స్కూల్ ఈ ప్రాంత ప్రజలకు వారి పిల్లల అభిరుచుల మేరకు మెరుగైన పాఠశాలలను ఎన్నుకునే అవకాశం కల్పించిందన్నారు. కాగా, ఈ స్కూల్‌లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) సిలబస్‌ను బోధిస్తామని నిర్వాహకులు తెలిపారు.



## 'ప్రభా'తం

# 'పెద్ద'ల పరువుకు పరీక్ష




కేంద్ర స్థాయిలో రాజ్యసభను పెద్దల సభగా పిలుచుకుంటే రాష్ట్ర స్థాయిలో శాసనమండలిని మేధావుల సభగా పిలుచుకుంటాం. రాజ్యసభ నిర్మాణంలో ఏ ఉద్దేశ్యాలైతే ఉన్నాయో, శాసన మండలి కూడా అదే పునాదులపై నిర్మితమైంది. అయితే మేధావులు, నిపుణులు, విద్యావంతులతో వుండాల్సిన శాసనమండలి సభ వివిధ రంగాల నేరగాళ్ళు, ఆరోపణలు వున్న వారికి అడ్డాగా మారడం, ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులున్న శాసనసభ ఆమోదించిన బిల్లులను మాకు విచక్షణాధికారాలున్నాయంటూ శాసనమండలిలో అడ్డుకోవడం వంటి చర్యల ద్వారా శాసనమండలిని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**భా**రత రాజ్యాంగం కలగూరగంప. ఇందులో మన సొంతమనేది ఒక్కటి కూడా లేదు. ప్రపంచంలోని చాలా దేశాల నుండి కాపీ కొట్టి అమలు చేసుకుంటున్నదే! కాకపోతే స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ఒక పరిపాలనా వ్యవస్థను అమలు చేయాలి కాబట్టి అప్పటికప్పుడు ఆయా దేశాల నుండి కొన్నేసి పాలనా పద్ధతులు, చట్టాలు, సూత్రాలు వంటివాటిని దిగుమతి చేసుకుని రాజ్యాంగం వ్రాసుకున్నాం. ఇలా దిగుమతి చేసుకున్న వాటిలో ఒక విధానమే పార్లమెంటరీ వ్యవస్థ. బ్రిటన్ పార్లమెంటరీ విధానాన్ని అనుసరిస్తున్న మనం అక్కడ ఎగువసభ, దిగువసభలాగే మన దేశంలోనూ లోక్‌సభ, రాజ్యసభలను ఏర్పాటు చేసుకున్నాం. జాతీయ స్థాయిలో ఈ రెండు సభలున్నట్లే రాష్ట్రాల పరిధిలో శాసనసభ, శాసనమండలి వున్నాయి.

అయితే జాతీయ స్థాయిలో రాజ్యసభ ఉనికి ఎప్పుడూ ప్రశ్నార్థకం కాలేదు. 543 మంది లోక్‌సభ సభ్యులు ప్రతి ఐదేళ్ళకోసారి ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజల నుండి ఎన్నుకోబడుతుంటే, పెద్దల సభగా పిలుచుకునే రాజ్యసభకు మాత్రం 250 మంది సభ్యులు ఆయా రాష్ట్రాల వాటా ప్రకారం ఆయా కేటగిరిలలో ఎంపికవుతూ వస్తున్నారు.

ముఖ్యంగా రాజ్యసభ ఏర్పాటులో ముఖ్య ఉద్దేశ్యం ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేని మేధావులను, ఆయా రంగాల నిపుణులను ఈ సభకు ఎంపిక చేయడం ద్వారా వారి సేవలను దేశ ప్రయోజనాలకు వాడుకోవడం. ఈ ఉద్దేశ్యం మంచిదే! ఎందుకంటే ఒక్కోసారి సమర్ధులు, నిజాయితీపరులు, మేధావులు ఎన్నికల్లో గెలవలేరు. నెత్తిమీద డజను కేసులున్నోళ్ళు, రేపిస్టులు, అవినీతిపరులు చాలా సులభంగా ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుస్తుంటారు. వీళ్ళ అవసరం దేశానికి ఎంతమాత్రం వుండదు. కాని ప్రజలు ఓట్లేసి గెలిపించారు కాబట్టి ఖచ్చితంగా భరించాలి. ఇలాంటి వారిని నెత్తినపెట్టుకోవడం ఎంత ప్రమాదమో... మేధావులు, అనుభవజ్ఞులు, దేశం పట్ల అంకితభావం కలవారిని పరిపాలనకు ఉపయోగించుకోకుంటే కూడా అంతే ప్రమాదం. రాజ్యసభ అన్నది వుండబట్టే మన్మోహన్‌సింగ్ లాంటి ప్రజాక్షేత్రంలో గెలవలేని ఆర్థిక మేధావులు ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఈ దేశానికి సేవలందించగలిగారు. నాటి నెహ్రూ హయాం నుండి నేటి నరేంద్ర మోడీ దాకా ఆయా ప్రధానుల మంత్రి వర్గాలలో రాజ్యసభ నుండే ఎంతో మంది కేంద్రమంత్రులుగా దేశానికి తమ అమూల్యమైన సేవలు అందించారు.

అయితే ఇటీవల కాలంలో ఆ పెద్దల సభపై వున్న గౌరవం, నమ్మకం పోతోంది. ఒకప్పుడు పెద్దరికంతో వుండే వాళ్ళే రాజ్యసభలో వుండేవాళ్ళు. కాని, ఇప్పుడు రాజ్యసభ అంటే ఆర్థిక నేరగాళ్ళకు, బ్యాంకులను వేలకోట్లకు ముంచినవాళ్ళకు, అక్రమ వ్యాపారాలు చేసి కోట్లు గడించిన వారికి అడ్డాగా మారింది. అంతేనా... చాలా రాజకీయ పార్టీలు రాజ్యసభను ఒక ఆర్థిక కేంద్రంగా వాడుకుంటున్నాయి. వందకోట్లు పార్టీ ఫండ్‌గా ఇస్తే చాలు... రాజ్యసభకు పంపిస్తాం అన్నంతగా రాజకీయ పార్టీలు రాజ్యసభ పరువును దిగజార్చాయి. ఈరోజు రాజ్యసభలో వున్న 250 మంది సభ్యులలో చాలా మంది ఆర్థిక నేరగాళ్ళు, వివిధ అవినీతి ఆరోపణలున్నవారిని చూస్తూనేవున్నాం.

కేంద్ర స్థాయిలో రాజ్యసభను పెద్దల సభగా పిలుచుకుంటే రాష్ట్ర స్థాయిలో శాసనమండలిని మేధావుల సభగా పిలుచుకుంటాం. రాజ్యసభ నిర్మాణంలో ఏ ఉద్దేశ్యాలైతే ఉన్నాయో, శాసనమండలి కూడా అదే పునాదులపై నిర్మితమైంది. అయితే కేంద్రస్థాయిలో రాజ్యసభ పటిష్టవంతమైనట్లుగా రాష్ట్రాల స్థాయిలో శాసనమండలి పటిష్టం కాలేకపోతోంది. దీని మనుగడ ఎగుడుదిగుడుల బాటలో సాగుతూనే వుంది. ఈరోజు దేశంలోని 29 రాష్ట్రాలలో కేవలం 6 రాష్ట్రాలలో మాత్రమే శాసనమండలి వ్యవస్థ కొనసాగుతోందంటే, ఇది ఎంతగా నిర్వీర్యమైపోయిందో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలిని రద్దు చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత 35 ఏళ్ళలో రాష్ట్రంలో శాసనమండలిని రద్దు చేయడం ఇది రెండోసారి. 1983లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు శాసనమండలిని రద్దు చేశారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, 2007లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి శాసనమండలిని పునరుద్ధరించారు.

అయితే మేధావులు, నిపుణులు, విద్యావంతులతో వుండాల్సిన శాసనమండలి సభ వివిధ రంగాల నేరగాళ్ళు, ఆరోపణలు వున్న వారికి అడ్డాగా మారడం, ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులున్న శాసనసభ ఆమోదించిన బిల్లులను మాకు విచక్షణాధికారాలున్నాయంటూ శాసనమండలిలో అడ్డుకోవడం వంటి చర్యల ద్వారా ఈ శాసనమండలి, తన రద్దు నోట్‌ను తానే వ్రాసుకున్నట్లయ్యింది.

మొత్తానికి పెద్దల సభలు అవసరమా? అనేంతగా పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి. పెద్దల సభలను దొడ్డిదారిగా ఎంచుకుంటుంటే, మేధావులు, విద్యావంతులకు వాటిలో ప్రవేశం లేకుండా చేస్తుంటే ఇక ప్రజలకు వాటి అవసరం ఉండకపోవచ్చు.

# విద్యార్థులకు మోడల్ గైడ్లు



కొండా ప్రవీణ్ శంకర్ చారిటబుల్ ట్రస్ట్, నెల్లూరు ఆధ్వర్యంలో ఈనెల 25 న నెల్లూరు తడికలబజార్ సెంటర్‌లో వున్న ఆర్‌యస్‌ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు తెలుగు, మాథ్స్, సోషల్, సైన్స్, ఇంగ్లీషు, హింది సబ్జెక్టులకు సంబంధించిన గైడ్లు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు గవర్నర్ కిషోర్, అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట సూర్యనారాయణ, ట్రెజరర్ అమరా వెంకటేశ్వర్లు, పచ్చిపులుసు శ్రీరాములు, కృష్ణమూర్తి, హజరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# తై అమావాస్యకు పోటెత్తిన భక్తులు



వేమాలశెట్టి బావి వద్ద పూజలు చేస్తున్న మహిళలు

నెల్లూరు దర్గామిట్ట రామ్‌నగర్‌లో ఉన్న శ్రీవైద్య వీరరాఘవస్వామి ఆలయానికి తై అమావాస్య(చొల్లంగి అమావాస్య)ను పురస్కరించుకుని ఈనెల 24న వేలాదిమంది భక్తులు పోటెత్తారు. సకల శుభాలు కలగాలని, విద్యాప్రాప్తి, మోక్షార్థులకు కైవల్యం ప్రసాదించాలని శ్రీవైద్య వీరరాఘవస్వామి వారిని మనో వాచకాలతో వేడుకుంటూ భక్తులు విశేషపూజలు చేశారు. సంప్రదాయంలో భాగంగా కోరుకున్న కోరికలు నెరవేరిన వారు తమ కోరికలు నెరవేరాలని శ్రీవైద్య వీరరాఘవస్వామిని వేడుకుంటూ ఆలయ ప్రాంగణంలోని బలిపీఠం వద్ద ఉప్పు, మిరియాలు సమర్పించారు. అనంతరం ఆలయంలోని ప్రాంగణంలో కొలువైన పరివార దేవతలు శ్రీ విఘ్నేశ్వరుడు, శ్రీ ఆంజనేయస్వామి వారిని, నాగశిలలను, శ్రీ వైద్య వీరరాఘవస్వామి, కనకవల్లి, పుష్పవల్లి ఉత్సవ మూర్తులను సాయినాథుడిని దర్శించుకున్నారు. దేవస్థానం నిర్వాహకులు పర్యవేక్షించారు.

# కొత్త పే స్కేళ్లు ఇవ్వండి

### - పాలిటెక్నిక్ సిబ్బంది వినతి

అఖిలభారత సాంకేతిక విద్యామండలి సిఫార్సు చేసిన విధంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపక సిబ్బందికి కొత్త పేస్కేళ్ళను అమలుచేయాలని కోరుతూ నెల్లూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు కోరుతున్నారు. ఆ మేరకు వారు ఈనెల 27న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకానాధ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఆ వినతి పత్రాన్ని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌కు అందజేయాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పి.రజని, పి.ప్రభాకర్, వై.లక్ష్మి, వై.విశ్వేశ్వరి, బి.విజయకుమార్, కిరణ్‌కాంత్, అమర్‌నాధ్, శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.




## పదవులకున్న విలువ పోతుంది

శాసనమండలి ఛైర్మెన్ ఎంఏ షరీఫ్ లాంటి వారి వ్యవహారశైలి వల్ల ఉన్నతమైన పదవులకున్న విలువే పోతుంది. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి పంపిన అభివృద్ధి వికేంద్రీకరణ, సిఆర్‌డిఏ రద్దు బిల్లులను శాసనమండలిలో చర్చించాలి. అవసరం లేదనుకుంటే ఆ బిల్లులను తిరస్కరించవచ్చు. అంతేగాని, శాసనమండలిలో చర్చకు పెట్టకుండానే చంద్రబాబునాయుడు పట్ల తన స్వామిభక్తిని నిరూపించుకునేలా మండలి ఛైర్మెన్ షరీఫ్ తన విచక్షణాధికారాన్ని దుర్వినియోగ పరుస్తూ బిల్లులను సెలక్ట్ కమిటీకి పంపడం తన పదవికున్న విలువను దిగజార్చడమే!

**ముచ్చాల నాగభూషణం, సూళ్లూరుపేట.**

## మంచి ప్రదర్శన

ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సంప్రదాయాలు, చారిత్రక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన శకటాన్ని ప్రదర్శించడం అభినందనీయం. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మంచి చొరవ చూపింది. తిరుమల బ్రహ్మోత్సవాల శోభను ప్రస్ఫుటిస్తూ శ్రీవారి ఆలయ నమూనా, కొండపల్లి బొమ్మలు, కూచిపూడి నృత్యం, కలంకారి అద్దకాలతో రూపొందించిన శకటం అందరినీ ఆకట్టుకున్నాయి.

**రాజా సూర్యనారాయణ, పొన్నూరు.**

## కామన్ సివిల్ కోడ్ తేవాలి

"ఒకే దేశం.. ఒకే చట్టం"... ఇది బీజేపీ ఎన్నికల ముందు నినాదం. కామన్ సివిల్‌కోడ్‌ను అమలు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. దేశంలో మతాల వారీగా చట్టాలను అమలు చేయాల్సిన అవసరం లేదు. దేశానికి చట్టాలు ఏ విధంగా అవసరమో ఆ విధంగానే వాటి రూపకల్పన జరగాలి. జనాభా నియంత్రణ, వివాహాలు, విడాకులు, ఉద్యోగాలు, చదువులు, వైద్యం, హక్కులు... అన్నింటిలోనూ ప్రజలందరికీ ఒకేలా వుండేలా చట్టాలను తయారు చేయాలి.

**సి.రాజీవి, నెల్లూరు.**

## సిఏఏను వ్యతిరేకించేదెందుకు?

సిఏఏ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్ బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడం లేదు. పింఛన్‌లకు, ఆరోగ్యశ్రీ కార్డులకు, బ్యాంకు లోన్‌లకు అన్ని ఆధారాలు చూపిస్తున్న వాళ్ళు పౌరసత్వ నిరూపణ కోసం ఆధారాలు చూపించలేరా? విదేశీ చొరబాటు దారులను అడ్డుకునేందుకు కేంద్రం ఆ బిల్లులు తీసుకొచ్చింది. దేశ భద్రత దృష్ట్యా ఆ బిల్లులను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఇకనైనా ఈ బిల్లులపై ప్రజలు అవగాహన పెంచుకొని నిరసనలకు దూరంగా ఉంటే మంచిది.

**టి.కొండారెడ్డి, సిఎస్‌పురం.**



## రిజిస్ట్రేషన్‌లకు బ్రేక్...

# రియల్టర్లకు షాక్!

### వ్యాపార రంగంపై దెబ్బ మీద దెబ్బ

***దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో జిల్లాలో ఓ వెలుగు వెలిగిన రియల్‌ఎస్టేట్ రంగం, ఆయన మరణ తర్వాత కుదేలైంది. 2009 నుండి ఈ జిల్లాలో కోలుకోలేకపోతోంది. 2014 దాకా అంతంత మాత్రంగా వుండింది. తెలుగుదేశం ప్రభుత్వం ఐదేళ్ల కాలంలోనూ ఆశించిన వేగం లేదు. కాకపోతే అంతో ఇంతో నడుస్తూ వచ్చింది. 2019 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వస్తే రియల్ ఎస్టేట్ రంగానికి మంచి రోజులొస్తాయని రియల్టర్లు ఆశించారు. ఆ ఉద్దేశ్యంతోనే వందకు 90మంది రియల్టర్లు వైసిపి గెలుపు కోసం పని చేశారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఇక రియల్‌ఎస్టేట్ రంగంలో దశ తిరుగుతుందని, వ్యాపారం మళ్ళీ ట్రాక్‌లో పడుతుందని భావించారు.***

వాళ్ళనుకున్నది ఒకటయితే, ఇక్కడ ఇంకోటి జరిగింది. రియల్‌ఎస్టేట్‌లో అద్భుతాలు జరగడం మాటేమోగాని, పరిస్థితి ఇంకొంచెం ఇబ్బందికరంగా మారింది. వైసిపి అధికారంలోకి వచ్చీ రావడంతోనే అప్రూవల్ లేని లే అవుట్లపై కఠినచర్యలంటూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 30 లే అవుట్లను 'నుడా' అధికారులు ధ్వంసం చేయించారు. అంతవరకు జిల్లాలో డిటిసిపి లే అవుట్లతో పాటు పంచాయితీ లే అవుట్లు కూడా వేసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండే వాళ్ళు. స్థలాల ధరలు కూడా డిటిసిపి లే అవుట్లలో ఒక విధంగా, పంచాయితీ లే అవుట్లలో ఇంకో విధంగా వుండేవి. లే అవుట్లను ధ్వంసం చేశాక జిల్లా వ్యాప్తంగా స్థలాల అమ్మకాలు, కొనుగోళ్ళు స్థంభించాయి. ఆ తర్వాత ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఇసుక పాలసీ రియల్ ఎస్టేట్ రంగానికి గోరుచుట్టుపై రోకలి పోటులా మారింది. రెండు నెలల పాటు ఇసుక తవ్వకాలపై నిషేధం, ఆ తర్వాత పెరిగిన ఇసుక రేట్లు నిర్మాణ రంగం మీద పెను ప్రభావం చూపించాయి. అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు, గృహసముదాయాలలో కట్టిన ఇళ్ళు అమ్ముడు పోతుంటే స్థలాల అమ్మకాలు పెరుగుతాయి, నిర్మాణ రంగమే స్థంభించడంతో దాని ప్రభావం లే అవుట్ల మీద పడింది.

చావుబ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడుతున్న రియల్ ఎస్టేట్‌పై ఇప్పుడు ప్రభుత్వం పెద్ద బండ వేసింది. అనధికార లే అవుట్లు, స్థలాలు క్రమబద్ధీకరించుకోవడానికి ఎల్‌ఆర్‌ఎస్ ఇవ్వాలని ఇటీవల మంత్రివర్గంలో తీర్మానించారు. దీనిప్రకారం ఈమధ్య ఒక జి.ఓ కూడా విడుదల చేశారు. ఈ జి.ఓను ఇక నుండి వేసే లే అవుట్లకు వర్తింప జేస్తే కొంతవరకు సాఫీగా నడిచేదేమో? కాని అప్రూవల్ లేని లే అవుట్లలో ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలంటే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు కట్టడంతో పాటు కన్వర్షన్ ఫీజు కూడా కట్టాలని, ఆ రశీదులు తెస్తేనే రిజిస్ట్రేషన్‌లని నిబంధన పెట్టారు.

దీని ప్రకారమైతే ఒక్క డిటిసిపి లే అవుట్లలో కొన్ని ఫ్లాట్లు తప్పితే ఇంకే ఫ్లాట్లు కూడా రిజిస్ట్రేషన్‌లు కావు. జిల్లా వ్యాప్తంగా డిటిసిపి లే అవుట్లు చాలా తక్కువ. నెల్లూరు నగరంలోనే ఇలాంటి లే అవుట్లను వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చు. పంచాయితీ పరిధిలోని లే అవుట్లే వేలసంఖ్యలో వున్నాయి. వీటిల్లో చాలావరకు ఫ్లాట్లను కొనేసి వున్నారు. ఇప్పుడు ఏదైనా అవసరం నిమిత్తం ఇలాంటి వాళ్ళు ఫ్లాట్లు అమ్ముకోవాలనుకున్నా ఆ స్థలాలకు ల్యాండ్ కన్వర్షన్ ఫీజులు చెల్లించక పోయివుంటే సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్‌లు కావేమోననే ఆందోళన నెలకొంది.

ప్రభుత్వం ఇచ్చిన జి.ఓ వల్ల జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో కూడా రిజిస్ట్రేషన్‌లు తగ్గిపోయాయి. డాక్యుమెంట్ రైటర్లకు పనిలేకుండా పోయింది. మొత్తానికి జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం చావుకు బ్రతుక్కి మధ్యన వేలాడుతోంది.

# గౌతమ్‌కు అదనపు బాధ్యత



రాష్ట్ర ఐ.టి పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇంకో బాధ్యతను అప్పగించాడు. నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థ గౌతమ్ పరిధిలోకే వచ్చింది. భవిష్యత్‌లో ఉపాధి అవకాశాల కల్పనకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థ ఎంతో కీలకం కానుంది.

## మండలి రద్దుతో.. పదవులు పోయె...

శాసన మండలిని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లా నుండి ముగ్గురు నాయకులు తమ ఎమ్మెల్సీ పదవులను కోల్పోనున్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, జిల్లా స్థానిక శాసనమండలి నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా గెలిచిన వాకాటి నారాయణరెడ్డి, తూర్పు రాయల సీమ ఉపాధ్యాయుల నియోజకవర్గం నుండి గెలిచిన నెల్లూరీయుడు విఠపు బాలసుబ్రహ్మణ్యంలు మాజీలు కానున్నారు.

ప్రస్తుతం శాసనమండలిలో నెల్లూరు జిల్లాకు చెందిన వాళ్ళుగా వుండేది ఈ ముగ్గురే! 2014 ఎన్నికల నాటికి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణలు కూడా ఎమ్మెల్సీలుగా వున్నారు. అయితే సర్వేపల్లి అసెంబ్లీ నుండి పోటీ చేసే క్రమంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి ముందుగానే రాజీనామా చేశారు. ఇక ఎన్నికల తర్వాత పి.నారాయణ పదవీకాలం కూడా పూర్తయ్యింది. దీంతో ఆ ముగ్గురే జిల్లా నుండి మండలిలో వున్నారు.



## 12ఏళ్ళలో 9మంది ఎమ్మెల్సీలు



2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ శాసనమండలిని పునరుద్ధరించింది. శాసనమండలిని తెచ్చినప్పటి నుండి పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలలో అధికార, ప్రతిపక్ష పార్టీ లెప్పుడూ గెలిచింది లేదు. ఇప్పటికి ఆ రెండు నియోజకవర్గాలకు మూడేసి సార్లు ఎన్నికలు జరిగితే అన్నిసార్లు కూడా పిడిఎఫ్ అభ్యర్థులే గెలిచారు. ఈ నియోజకవర్గాల నుండి విఠపు బాలసుబ్రహ్మణ్యం మూడుసార్లు, స్వర్గీయ దాచూరు రామిరెడ్డి రెండుసార్లు, యండపల్లి శ్రీనివాసులురెడ్డి ఒకసారి గెలిచారు. నెల్లూరు జిల్లా స్థానిక శాసనమండలి నియోజకవర్గం స్థానానికి తొలిసారి జరిగిన ఎన్నికల్లో రెబల్ అభ్యర్థిగా పోటీలోకి దిగి బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఎమ్మెల్సీ అయ్యాడు. ఆ తర్వాత రెండుసార్లు వాకాటి నారాయణరెడ్డి ఒకసారి కాంగ్రెస్ అభ్యర్థిగా, క్రితంసారి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలుపొంది ఎమ్మెల్సీ అయ్యాడు.

ఇక గత కాంగ్రెస్ ప్రభుత్వంలో బలహీనవర్గాలకు చెందిన బూదాటి రాధయ్య ఎమ్మెల్యేల కోటా నుండి ఎమ్మెల్సీగా ఎన్నికవగా, గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఏకంగా పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రలకు గవర్నర్ ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవులు దక్కాయి. ఇలా మండలి 12ఏళ్ల కాలంలో జిల్లా నుండి 9మంది నాయకులకు ఎమ్మెల్సీ హోదా దక్కడం విశేషం!

## ఎమ్మెల్సీల వల్లే మంత్రులు..



గత తెలుగుదేశం ప్రభుత్వంలో జిల్లా నుండి మొదట పి.నారాయణ, ఆ తర్వాత రెండున్నరేళ్ళకు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు మంత్రులయ్యారు. నారాయణ ఎన్నికల్లో పోటీ చేయన ప్పటికీ చంద్రబాబు ఆయనను మంత్రిని చేసి ఆపైన ఎమ్మెల్సీని చేశాడు. రెండున్నరేళ్ళ తర్వాత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రలను శాసనమండలిలోకి తీసుకున్నారు. ఆ తర్వాత కొంతకాలానికి సోమిరెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. శాసనమండలి అన్నదే లేకుంటే గత తెలుగుదేశం ప్రభుత్వంలో అటు నారాయణకు గాని, ఇటు సోమిరెడ్డికి గాని మంత్రులయ్యే అవకాశమే వుండేది కాదు.



# ఆశలు హాంఫట్...

శాసన మండలి రద్దు నిర్ణయం ఇప్పుడున్న అధికార, విపక్ష ఎమ్మెల్సీలలోనే కాదు, భవిష్యత్‌లో ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తున్న వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులను కూడా తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. అభివృద్ధి వికేంద్రీకరణ, సిఆర్‌డిఏ రద్దు బిల్లులను అడ్డుకోవడానికి ప్రతిపక్ష నేతగా చంద్రబాబు ఆడిన దొంగాట ఇలా తమ ఆశలను ఆవిరి చేస్తుందనుకోలేదని వారు వాపోతున్నారు.

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో నెల్లూరు జిల్లా నుండి పలువురు ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్నారు. వీరిలో పార్టీ స్థాపించిన నాటి నుండి వున్నవారితో పాటు మధ్యలో పార్టీలో చేరి పార్టీ కోసం పని చేసిన వాళ్ళు కూడా వున్నారు.

ఈ జాబితాలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మొదటి స్థానంలో వుంటాడు. 2015లో వైసిపిలో చేరిన ఆయన పార్టీ కోసం నిజాయితీగా పని చేశాడు. 2018లో నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల శాసన మండలి నుండి ఎవరూ పోటీ చేయడానికి ముందుకు రాని తరుణంలో ఆయన పోటీకి దిగి పార్టీ తరపున పోరాడాడు. వైసిపి అధికారంలోకి వస్తే ఆయనకు ఎమ్మెల్సీ గ్యారంటీ అన్న ప్రచారం వుంది. ఇటీవల డిసిసిబి ఛైర్మెన్ పదవిని ఇచ్చినా అది తాత్కాలికమేనని, ఎమ్మెల్సీ ఇవ్వడమే ఆయనకు కరెక్ట్ అన్న ప్రచారం కూడా వుంది. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు కూడా ఆనం విజయకు ఎమ్మెల్సీ ఇస్తారని పలు సందర్భాలలో పేర్కొనడం జరిగింది. నిన్నటి ఎన్నికలలో గూడూరు సీటును ఆశించి భంగపడ్డ మేరిగ మురళీ కూడా ఎస్సీ కోటా నుండి ఎమ్మెల్సీ రేసులో వున్నాడు. అలాగే పార్టీ పెట్టినప్పటి నుండి జెండా మోస్తున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి లాంటి నాయకులు కూడా ఎమ్మెల్సీపై ఆశలు పెంచుకుని వున్నారు. ఎన్నికల సమయంలో వైసిపిలో చేరిన మాజీ డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, గూడూరుకు చెందిన పారిశ్రామికవేత్త పొణకా శివకుమార్‌రెడ్డి, బత్తిన విజయకుమార్ వంటి నాయకులు కూడా ఎమ్మెల్సీలపై ఆశలు పెట్టుకోగా.. మండలి రద్దు నిర్ణయంతో వాళ్ళ కలలన్నీ చెదిరిపోయాయి.



# పారిశుద్ధ్యం మెరుగుకు పరుగు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పివివిఎస్ మూర్తి

నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు పరుగులు పెట్టి పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి సూచించారు. 27వ తేదీ ఆయన నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో శానిటరీ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సచివాలయాలకు పారిశుధ్య కార్మికులను కేటాయించినట్లు తెలిపారు. సచివాలయ కార్యదర్శుల పర్యవేక్షణలో పారిశుధ్య పనులను మరింత వేగంగా చేస్తామన్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు అవసరమైన అదనపు సిబ్బంది కోసం టెండర్ ప్రక్రియను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, శానిటరీ సూపర్‌వైజర్ ప్రతాప్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్లు సురేంద్ర, శేషయ్య, శ్రీనివాసులు, గిరి, నరసింహారావు పాల్గొన్నారు.

## బెస్ట్ ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్ అవార్డునందుకున్న మూర్తి

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతులమీదుగా 'బెస్ట్ ఎలక్ట్రోరల్ మేనేజ్‌మెంట్' అవార్డును అందుకున్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ఓటర్ల నమోదు ప్రక్రియను అత్యంత సమర్ధవంతంగా నిర్వహించినందుకు 25వ తేదీ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం వారు విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డ్‌ను అందుకోవడం జరిగింది.

## రాజన్న రాజ్యమా...? దోపిడీ రాజ్యమా?

- కోటంరెడ్డి శీనయ్య



ఒక్క అవకాశమిస్తే రాష్ట్రంలో రాజన్న రాజ్యం తెస్తానని చెప్పిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రౌడీరాజ్యాన్ని, ఫ్యాక్షన్ రాజ్యాన్ని తీసుకొచ్చాడని నుడా మాజీఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శించాడు. మంగళవారం నెల్లూరులోని జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశంతోనే జగన్ రాష్ట్రాన్ని అధోగతిపాల్జేశాడని ఆరోపించాడు. అమరావతి రాజధాని కోసం పోరాడుతున్న మహిళలను చిత్ర హింసలకు గురిచేసి రాక్షసత్వాన్ని చూపాడని, అమరావతి ఉద్యమాన్ని అణచి వేసేందుకు ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశాడు. ప్రతి శుక్రవారం కోర్టుకెళ్లడానికి 60లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేసే జగన్ సీఎంగా మనకు అవసరమా అన్న ఆలోచన ప్రజల్లో మొదలైందన్నాడు. జగన్‌లో రాయలసీమ పౌరుషమే వుంటే శాసనమండలి తరహాలోనే శాసనసభను కూడా రద్దు చేయాలని సవాల్ విసిరాడు.

# నెల్లూరు కబుర్లు



## వార్డు సచివాలయంలో కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు మంగళవారం 19వ డివిజన్ పరిధిలోని వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సచివాలయంలో వసతులను పరిశీలించి, కార్యదర్శులతో మాట్లాడారు. ప్రజలకు సక్రమంగా సేవలందించాలని సూచించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి కూడా వున్నారు.

## కాంగ్రెస్‌లోకి సిపిఐ కార్యకర్తలు

సిపిఐకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఇటీవల జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. డివైఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు ఖయ్యూం ఆధ్వర్యంలో చేరిన వీరందరికీ చేవూరు దేవకుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పారు. ఇందిరాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావ్, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, టి.బాలసుధాకర్, హుస్సేన్, లతారెడ్డి, కరిముల్లా, సాజిద్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స



వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ శశిధర్


నెల్లూరులోని మెడికవర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఈనెల 25 న విలేకరుల సమావేశంలో ఆసుపత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు శశిధర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం గౌరవరం గ్రామానికి చెందిన పుల్లమ్మ (80) ఒక కాలు తొడ భాగంలో విపరీతమైన నొప్పితో బాధపడుతూ తమను సంప్రదించారన్నారు. ఎముకలు బలహీనంగా మారడం, పొటాషియం విలువలు అసాధారణంగా ఉండడం వల్లనే ఇలా జరిగిందని గుర్తించి కిడ్నీ, గుండె వ్యాధి నిపుణుల ఆధ్వర్యంలో పూర్తిస్థాయి చికిత్సను ప్రారంభించి దెబ్బతిన్న కిడ్నీ పనితీరును సాధారణ స్థితికి తీసుకు వచ్చామన్నారు. డా. వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఈ చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. మత్తు వైద్యుడు రాజమోహన్‌రెడ్డి, క్రిటికల్ కేర్ వైద్యుడు షఫీ, సీఏవో వంశీమోహన్, మెడికల్ డైరెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌లో ఉచిత వాహనం



నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే వృద్ధులు, మహిళలు, వికలాంగుల కోసం ప్రధాన ద్వారం నుండి కార్యాలయం వరకు ఒక ఉచిత బ్యాటరీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. రిపబ్లిక్ డే నుండి ఈ సేవలను ప్రారంభించారు. 'స్పందన' కార్యక్రమమున్న రోజు ఈ సేవలు బాగా ఉపయోగపడొచ్చు.

## ఆనంను కలిసిన ఏసునాయుడు



నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంబేటి ఏసునాయుడు మంగళవారం వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరు, సంతపేటలోని ఆయన నివాసంలో కలిశారు. ఆనంను శాలువాతో సత్కరించి, ఆయన మద్దతు ఆకాంక్షించారు.

## మూడు రాజధానులకు మద్దతుగా మోటార్‌బైక్‌ల ర్యాలీ



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి మద్దతుగా 27వ తేదీ వైసిపి శ్రేణులు నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పి.రూప్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్ నుండి మొదలైన ర్యాలీ వీఆర్‌సి, మద్రాసు బస్టాండ్, కెవిఆర్ పెట్రోల్ బంకు, మినీ బైపాస్, రామలింగాపురం సెంటర్‌ల మీదుగా విజయ మహల్‌గేటు వద్ద గల రాజన్న భవన్ వరకు సాగింది. బైక్ ర్యాలీలో పాల్గొన్న వందలాది మంది కార్యకర్తలు మూడురాజధానులకు మద్దతుగా నినాదాలు చేశారు.

## నరేంద్రబాబుకు సన్మానం



ప్రముఖ సాహితీవేత్త, నెల్లూరులోని కెవిఆర్ మునిసిపల్ నగర పాలక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబుకు గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఘనసన్మానం జరిగింది. సాహిత్యరంగంలో విశేషకృషి చేస్తున్న నరేంద్రబాబును జిల్లా కలెక్టర్ ఎం.వి శేషగిరిబాబు ప్రశంసాపత్రం, జ్ఞాపికలను బహుకరించి సన్మానించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు రంగాల్లో విశిష్ట కృషి చేస్తున్న వారిని ఈ వేడుకల్లో సత్కరించారు. గుండాల నరేంద్రబాబుకు ఈ సత్కారం లభించడం పట్ల ఆయన సహచరులు, సాహిత్యాభిమానులు సంతోషం వ్యక్తం చేశారు.

## సిఐటియు జాతీయ కౌన్సిల్‌లో కఠారి అజయ్

నెల్లూరుకు చెందిన సిఐటియు జిల్లా కార్యదర్శి కఠారి అజయ్‌కుమార్‌ను సిఐటియు జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. చెన్నైలో జరిగిన సిఐటియు మహాసభల్లో ఈమేరకు ఆయనను ఎన్నుకోవడం జరిగింది.



## శబరి శ్రీరామక్షేత్రంకు ఏర్పాటు కానున్న పాలకవర్గం

నెల్లూరు, దుర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంకు ఆలయ చరిత్రలోనే తొలిసారి పాలకవర్గం ఏర్పాటు కానుంది. ఈమేరకు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేశారు. దాతల సహకారంతో 22ఏళ్ల క్రితం శబరి శ్రీరామక్షేత్రంను నిర్మించారు. 6సి కేటగిరిగా గుర్తింపు పొందిన ఈ ఆలయం, పదేళ్ల క్రితం దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చింది. అయితే ఇంతవరకు పాలకవర్గాలను ఎప్పుడూ ఏర్పాటు చేయలేదు. పలువురు దాతలు, భక్తులు, దేవాదాయ శాఖ ఉద్యోగుల పర్యవేక్షణలోనే శ్రీ శబరి రామ క్షేత్రంలో నిత్యపూజలు, వేడుకలు జరుగుతుండేవి. ఇప్పుడు తొలిసారిగా ఈ ఆలయానికి పాలకవర్గం ఏర్పాటు కానుంది.

## సెలవుపై రంగనాథస్వామి ఆలయ ఇ.ఓ గోపి

### ఇన్‌ఛార్జ్ ఇ.ఓగా వెంకటేశ్వర్లు

నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం ఇ.ఓ వేమూరి గోపి దీర్ఘకాలిక సెలవుపెట్టాడు. వైకుంఠ ఏకాదశి నాడు పాసులు జారీ చేయడంలో వచ్చిన తేడాలతోనే అధికారపార్టీ నాయకులు ఆయనపై ఆగ్రహించారు. ఈ కారణంగానే ఆయన సెలవు పెట్టగా, మూలాపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానం ఇ.ఓగా పనిచేస్తున్న డి.వెంకటేశ్వర్లు రంగనాథస్వామి దేవస్థానం ఇన్‌ఛార్జ్ ఇ.ఓగా బాధ్యతలు తీసుకున్నారు.

## సప్తవాహన సేవ

రథసప్తమిని పురస్కరించుకుని ఫిబ్రవరి 1వ తేదీ నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో సప్తవాహన సేవలు నిర్వహిస్తున్నారు. ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహనం, 9 గంటలకు గరుడవాహనం, 10.30 గంటలకు సింహవాహనం, 11.30 గంటలకు హంస వాహనం, మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుమంజనం, 1.30 గంటలకు చక్రస్నానం, 3.30 గంటలకు తిరుచ్చి, సాయంత్రం 4.30 గంటలకు పెద్దశేష వాహనం, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనసేవలు జరుగనున్నాయి.

## ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం పాలకవర్గం ప్రమాణస్వీకారం

నెల్లూరు గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం పాలకవర్గం ప్రమాణస్వీకారం ఈనెల 25వ తేదీ దేవస్థానం ప్రాంగణంలో జరిగింది. అధ్యక్షులుగా ఒట్టూరు సురేంద్ర, ధర్మకర్తలుగా యారంరెడ్డి కుమార్, కూరపాటి వెంకయ్య, ఎండ్లూరి భాస్కర్, కుమార్‌దేవి, సర్వేపల్లి సుజన, నెల్లూరు శైలజ, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా అర్చకుడు పులికొలను చంద్రశేఖర్‌లు ప్రమాణస్వీకారం చేశారు.

నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆప్కాబ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, వైసిపి నెల్లూరు రూరల్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వైసిపి నాయకులు పి.రూప్‌కుమార్‌యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వరాలయంలో...

# నేత్రపర్వంగా మహా కుంభాభిషేకం

- అమ్మవారి గోపుర శిఖరంపై స్వర్ణకలశాల స్థాపన
- భారీగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసిన మంత్రి అనిల్



నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఈనెల 26న మహాకుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భువనేశ్వరి అమ్మవారి విమానగోపురంపై స్వర్ణకలశాలను ప్రతిష్టించారు. రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి డా. అనిల్ పాల్గొని ఆ స్వర్ణకలశాలకు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్చాటనల మధ్య, మంగళ వాయిద్యాల మధ్య ఆలయం ధ్వజస్థంభం వద్ద నుంచి భువనేశ్వరి అమ్మవారి మందిరం వరకు కలశాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారికి మంత్రి అనిల్ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కలశప్రతిష్ట ఎంతో కన్నులపండువగా జరిగింది. రాజ గోపురాన్ని పునర్నిర్మాణం చేసిన భువనేశ్వరి అమ్మవారి గోపురం, పరివార దేవతల గోపురాలపై కలశాలకు ఎంతో వేడుకగా కుంభాభిషేకాలు జరిగాయి. తదుపరి భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరుని ఉత్సవమూర్తులకు, మూలవర్లకు విశేషంగా మహాకుంభాభిషేకాలు నిర్వహించారు. పెద్దఎత్తున విచ్చేసిన భక్తజనుల సమక్షంలో మహాకుంభాభిషేక వేడుకలు అత్యంత వైభవంగా.. శాస్త్రోక్తంగా జరిగాయి.

అనంతరం రాత్రి స్వామివారికి దివ్య కల్యాణోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ వేడులకు సహకరించిన ఉభయదాతలను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించి స్వామివార్ల ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఇ.ఓ వేణుగోపాల్, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ లోకిరెడ్డి వెంకటేశ్వరెడ్డిల పర్యవేక్షణలో ఈ వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ ఆల్తూరి గిరీష్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైకాపా నాయకులు రూప్ కుమార్‌యాదవ్, గిరిధర్‌రెడ్డి, వైవి రామిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. ఈ మహాకుంభాభిషేక మహోత్సవ వేడుకలను మూడురోజుల పాటు ఎంతో వైభవంగా నిర్వహించారు.



భువనేశ్వరి అమ్మవారి విమాన గోపురంపై కలశ ప్రతిష్టాపన

# ఘనంగా గణతంత్ర వేడుకలు

***జనవరి 26న నెల్లూరు పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లో 71వ గణతంత్ర దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఎంతో కోలాహలంగా ఆనందోత్సాహాల మధ్య జరిగిన ఈ వేడుకలకు నగర ప్రజలు, విద్యార్థులు భారీగా తరలివచ్చి పతాక వందనం, సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనపరచిన ప్రభుత్వ ఉద్యోగులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లావ్యాప్తంగా వాడవాడలా గణతంత్ర వేడుకలు మిన్నుముట్టాయి.***



జెండా వందనం చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, ఎస్పీ భాస్కర్‌భూషణ్

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాలు' కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిందని, పల్లెలు, పట్టణాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడంలో భాగంగా సచివాలయ వ్యవస్థను ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ ఎం.వి శేషగిరిబాబు అన్నారు. జనవరి 26న భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా నెల్లూరు పోలీస్‌పెరేడ్ మైదానంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్‌తో కలసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 665 గ్రామ సచివాలయాలు, మరో 166 వార్డు సచివాలయాలు ఏర్పాటుచేశామని, అన్ని వర్గాల వారికి సంక్షేమపథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రానున్న రోజుల్లో జిల్లాలో మరింత పురోభివృద్ధి జరుగుతుందన్నారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ రైతు భరోసా, పిఎం కిసాన్ పథకాల కింద 13,500 రూపాయల వంతున ఈ ఏడాది 1.89 లక్షల కుటుంబాలకు 159 కోట్ల రూపాయలు అందించామని, జిల్లాలో ఫిబ్రవరి నాటికి 230 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేస్తామని, ఈ కేంద్రాల ద్వారానే రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల కింద విడుదల చేసిన నిధుల వివరాలను తెలిపారు. నవరత్నాల కార్యక్రమంలో భాగంగా పేదలందరికీ ఇళ్ళ పథకం కింద ఉగాది నాటికి ఇళ్లస్థలాలు అందించడం జరుగుతుందని, జిల్లాలో 1,78,174 మందిని ఈ పథకం కింద అర్హులుగా గుర్తించామని అన్నారు. వారికి మొత్తం 2,853 ఎకరాల భూమి అవసరం కాగా ఇందులో 2446 ఎకరాల ప్రభుత్వభూమి అనువైనదిగా గుర్తించామన్నారు. మిగిలిన 407 ఎకరాలను కూడా ప్రభుత్వం నిర్ధేశించిన గడువులోగా సేకరించి ఇళ్ల స్థలాలు కేటాయిస్తామన్నారు. జిల్లాలో అమ్మఒడి పథకం ద్వారా 2,20,607 మంది తల్లులకు 15వేల రూపాయల వంతున 330.91 కోట్ల రూపాయలు అందజేశామని, రాజన్న బడిబాట కింద 8,9 తరగతుల బాలికలకు 20,492 సైకిళ్ళు పంపిణీ చేశామని, జిల్లాలో 1026 పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం 105 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. జేసీ-2 కమలకుమారి, డిఆర్‌ఓ మల్లికార్జున, ట్రైనీ కలెక్టర్ కల్పనాకుమారి, సబ్‌కలెక్టర్‌లు గోపాలకృష్ణ, శ్రీధర్, నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



ఆకర్షించిన శకటాలు



ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు



# ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు

**- ఎస్పీ భాస్కర్ భూషణ్**

అతివేగం అనర్ధదాయకమని, మితిమీరిన వేగంతో ప్రమాదాలను కొనితెచ్చుకోవడమేనని జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ హెచ్చరించారు.

27వ తేదీ నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని 1వ డిపోలో ఆర్టీసీ 31వ రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతి థిగా పాల్గొన్న ఎస్పీ భాస్కర్‌భూషణ్ మాట్లాడుతూ అతి వేగమే ప్రమాదాలకు కారణమన్న విషయాన్ని ప్రతిఒక్క డ్రైవర్ గుర్తుంచుకోవాలని సూచించారు. అతి వేగం, నిద్రలేమి, మద్యం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన లేకపోవడం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలవుతున్నాయన్నారు. గత ఏడాది జిల్లాలో 500 మంది రోడ్డు ప్రమాదాలలో మృతి చెందగా, అందులో 300 మంది మరణానికి మితిమీరిన వేగమే కారణమన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపై వుందన్నారు. ఒక్కో డ్రైవర్ చేతిలో ఎంతో మంది ప్రాణాలుంటాయని, మీ అప్రమత్తత, బాధ్యత వారికి శ్రీరామరక్ష కావాలన్నారు. ఈ ఏడాది జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు అందరం కలిసి కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఈ ఏడాది ప్రమాద రహిత డ్రైవర్లుగా నిలిచిన 10 మందిని ఎస్పీ భాస్కర్ భూషణ్, ఆర్టీసీ జాయింట్ కమిషనర్ వెంకటశేషయ్యలు జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు.

# చంద్రమోహన్‌కు చంద్రబాబు పరామర్శ



ఇటీవలే గుండె రక్తనాళాలకు స్టెంట్‌లు వేయించుకుని హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఆదివారం తెలుగుదేశం అధినేత, మాజీముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించాడు. ఆరోగ్య పరిస్థితి గురించి ఆయన అడిగి తెలుసుకున్నాడు. తగిన విశ్రాంతి తీసుకుంటూ, వేళకు మందులు వేసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సోమిరెడ్డికి సూచించాడు.

గుంటూరు ఎంపి గల్లా జయదేవ్, టిడిపి కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, నెల్లూరుజిల్లా టిడిపి నాయకులు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, జి.మురళీ కన్నబాబులు కూడా సోమిరెడ్డిని పరామర్శించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# కల్యాణ వైభవం...!

## శివకుమార్ - స్రవంతి



'కళాంజలి' సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పాలపర్తి అనంతరావు - పద్మావతిల కుమారుడు **శివకుమార్ - స్రవంతి** (పొదలకూరు మండలం కనుపర్తి గ్రామ వాస్తవ్యులు పులపుత్తూరు భాస్కర్ - కీ॥శే॥ లక్ష్మీకాంతంల కుమార్తె)ల కల్యాణం జనవరి 26వ తేదీ నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని హెచ్‌ఎన్‌ఆర్ రెసిడెన్సీ నందు జరిగింది. ఆరోజు రాత్రి జరిగిన రిసెప్షన్ వేడుకకు రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ హాజరై వధూవరులను దీవించాడు. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

## హారిక - సురేష్



గూడూరు వాస్తవ్యులు, రిటైర్డ్ ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ మల్లెమాల మురళీరెడ్డి - రమాదేవిల కుమార్తె **డాక్టర్ హారిక - డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి** (కడప జిల్లా లక్కిరెడ్డిపల్లి పట్టణ వాస్తవ్యులు రామిరెడ్డిగారి ప్రతాప్‌రెడ్డి - కనకమ్మల కుమారుడు)ల వివాహం ఇటీవల గూడూరు దివ్య ఫంక్షన్‌హాలులో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# లిటిల్ ఏంజల్స్ 35వ వార్షికోత్సవం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

గూడూరు మండల పరిధిలో ఉన్న లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ 35వ వార్షికోత్సవ వేడుకలను ఇటీవల ఆ స్కూలులో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం అధ్యక్షుడు ఎ.కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ లిటిల్ ఏంజెల్స్ పాఠశాల వారు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించడం ఎంతో అభినందనీయమన్నారు. ఎల్ఏపి కరస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతి ఒక్క విద్యార్థి ఎంతో క్రమశిక్షణతో ఉపాధ్యాయులు నడిపే బాటలో నడుస్తున్నారని, అటువంటి విద్యార్థులు భవిష్యత్తులో మంచి పేరు తెచ్చుకుంటారని తెలిపారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, నాటికలు అందరినీ అలరించాయి. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులందజేశారు. ఎల్ఏపి ఛైర్మెన్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, తల్లిదండ్రుల కమిటీ సెక్రటరీ ఎం.దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఓం నమఃశివాయ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

## పేదలకు దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బత్తిన విజయకుమార్

రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26వ తేదీ గూడూరు సాధుపేట సెంటర్‌లో వైయస్‌ఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు బత్తిన విజయకుమార్ పేద మహిళలకు, వృద్ధులకు, దివ్యాంగులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశాడు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

# మహనీయుల త్యాగఫలమే గణతంత్రం

ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే నేడు అందరం జరుపుకుంటున్న గణతంత్ర వేడుకలని గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఈ నెల 26న సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు, డిఎస్పీ శ్రీ భవానిహర్ష, అధికారులు ఇతర ప్రజాప్రతినిధులు కలిసి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ గాంధీ సత్యాగ్రహం, శాంతిమార్గంలో దేశం కోసం పోరాటం చేశారని, అలాంటి మహానుభావులను అందరూ గుర్తుంచుకోవాలన్నారు. పట్టణంలోని పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గూడూరు తహశీల్దార్ బాలి లీలారాణి, సిఐలు దశరధరామారావు, రామకృష్ణారెడ్డి, డిప్యూటి డిఎం అండ్ హెచ్‌ఓ అచ్యుత కుమారి, కమిషనర్ ఓబులేశు, ఎంపిడివో నాగమణి, ఎస్సైలు సైదులు, బ్రహ్మనాయుడు, ఆదిలక్ష్మి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



జెండాకు వందనం చేస్తున్న గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, ఎమ్మెల్యే వరప్రసాదరావు, డిఎస్పీ శ్రీ భవాని హర్ష



శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 71వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు, ఎస్పీ భాస్కర్‌భూషణ్ చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రాలను అందుకుంటున్న గూడూరు తహశీల్దార్ లీలారాణి, గూడూరు పట్టణ సి.ఐ దశరధరామయ్య



గూడూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ చేతులమీదుగా అవార్డులనందుకుంటున్న గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.వెంకటేశ్వర్లురాజు, ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి

# అతివేగం.. అత్యంత ప్రమాదకరం



ప్రమాణం చేస్తున్న ఆర్టీవో మల్లికార్జునరెడ్డి

వాహనాలను నిబంధనలకు అనుగుణంగా నడపాలని, అతివేగం అత్యంత ప్రమాదకరమని ఆర్టీవో మల్లికార్జునరెడ్డి తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ఇటీవల గూడూరు పట్టణంలోని గ్రీన్ వ్యాలీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాలు నివారించడంలో కీలకపాత్ర పోషించాలని తెలియజేశారు. మద్యం సేవించి, హెల్మెట్, సీటు బెల్టు లేకుండా వాహనాలు నడపకూడదని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు హెల్మెట్‌లను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐలు మురళీమోహన్, రాఘవరావు, భాస్కర్‌రావు, బాలమురళీకృష్ణ, అసిస్టెంట్ మోటారు వాహన ఇన్స్‌పెక్టర్ శేషరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్లు బి.శ్రీకాంత్‌రెడ్డి, కె.ఆర్.రెడ్డి, బాలకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని కాపాడే శక్తి చంద్రబాబుకే వుంది

**- చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి**



పార్టీలో చేరిన యువకులతో టిడిపి నాయకులు అజీజ్, చేజర్ల వెంకటేశ్వర్లు, కోటంరెడ్డి శీనయ్య

అమరావతి రాజధాని, ఆంధ్ర రాష్ట్రాన్ని కాపాడే శక్తి సామర్థ్యాలు ఒక్క చంద్రబాబు నాయుడుకే వున్నాయని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి అన్నారు. ఈనెల 26న నెల్లూరులోని ఎన్టీఆర్‌భవన్‌లో నెల్లూరురూరల్ టీడీపీ ఇన్‌చార్జి అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో వైకాపా, జనసేన నుంచి పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తెలుగుదేశం పార్టీ అండగా వుంటుందన్నారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాళ్ళపాక అనూరాధ, నాయకులు జెన్ని రమణయ్య, ఆనం వెంకటరమణారెడ్డి, కిలారి వెంకటస్వామి నాయుడు, ఖాజావలి, నన్నేసాహెబ్, సాబిర్ ఖాన్, రసూల్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో పలువురు చేరిక

నెల్లూరులోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యశ్వంత్ సింగ్ ఆధ్వర్యంలో జేపీ సింగ్‌తో పాటు చిన్నబజార్ తదితర ప్రాంతాలకు చెందిన యువత ఈనెల 26 న పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు జి.భరత్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ సమిష్టి కృషితో పార్టీనీ బలోపేతం చేయాలన్నారు. దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని మోడి పనిచేస్తున్నారన్నారు. పార్టీ జిల్లా మాజీఅధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నేతలు మండ్ల ఈశ్వరయ్య, వంశీధర్‌రెడ్డి, పి.మస్తానయ్య, బాలయ్య గౌడ్, మిడతల రమేష్, పరుశు రామ్, పెదరోశయ్య తదితరులు పాల్గొన్నారు.

### శాసనమండలి

# రద్దు తగదు

నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన భవన్‌లో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గతంలో శాసనమండలిని అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రజలకు అవసరమైన ఎన్నో అంశాలపై మండలిలో సభ్యులు చర్చించి ఆయా బిల్లులకు ఆమోదం లభించిందన్నారు. నేడు మండలిని రద్దు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మండలిని రద్దు చేయడం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మీద ఉంటుందని, ఆరు రాష్ట్రాల్లో మండలి కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు ఎన్నో బిల్లులు ఇక్కడ ఆమోదం పొందాయని, కాని ఇంగ్లీషు మీడియం బిల్లు, మూడు రాజధానుల బిల్లులు మాత్రం ఆమోదం పొందలేదని, ఈ బిల్లులు ఆమోదం పొందనంత మాత్రాన మండలిని రద్దు చేయడం సరికాదన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ నేతలు ఎన్నికల సమయంలో మండలిని రద్దు చేస్తామని ఎన్నికల వాగ్దానంలో ఉంచి అధికారంలోకి వచ్చిన వెంటనే దీన్ని రద్దుచేసి వుంటే న్యాయంగా ఉండేదన్నారు. అలాకాకుండా వారు తెచ్చిన బిల్లు ఈ సభలో ఆమోదం పొందలేదనే కోపంతో మండలిని రద్దు చేస్తామనడం సరికాదన్నారు.

# మహిళల భద్రతే లక్ష్యం

**జిల్లా ఎస్పీ భాస్కర భూషణ్**

గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ భాస్కర భూషణ్ పిలుపునిచ్చారు. ఈనెల 25న చెముడుగుంటలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో మూడవ బ్యాచ్ గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శుల రెండు వారాల శిక్షణ ముగిసింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ కార్యదర్శులు అందరికి అందుబాటులో వుంటూ సమస్యలను తెలుసుకుంటూ ఇతర శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. పనిచేసే ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు, వృద్ధులపై నేరాలను నివారించడంతో పాటు నేరం జరిగిన సమయంలో పోలీస్ అధికారులకు సమాచారాన్ని తెలియజేయాలన్నారు. పోలీస్ స్టేషన్లలో ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి హాజరై క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను తెలియజేయాలన్నారు. దిశ చట్టం, సఖి (వన్ స్టాప్ సెంటర్), మహిళల చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించి వారిని చైతన్యవంతులను చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న 123 మందిని అభినందించారు. శిక్షణలో అన్ని అంశాల్లో ప్రతిభ కనుపరచి టాపర్లుగా నిలిచిన శ్రావణి, ప్రియాంక, స్రవంతి, జయపద్మినికి మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్‌రావు, ఐసీడీయస్ పీడీ సుధాభారతి, డీటీసీ వైస్ ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి, డీసీపీఓ సురేష్, సఖి అధికారి జ్యోత్స్న, ఆర్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గౌరీశంకరుడుకు ఇండియన్ పోలీసు పతకం

నెల్లూరు ఏఆర్ విభాగంలో ఆర్ ఎస్సైగా పనిచేస్తున్న ఎన్. గౌరీశంకరుడుకు కేంద్ర ప్రభుత్వం ఇండియన్ పోలీసు మెడల్(ఐపీఎం) ప్రకటించింది. విధి నిర్వహణలో ఏలాంటి రిమార్కులు లేకుండా సేవలందించినందుకుగాను గౌరీశంకరుడు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. గుంటూరు జిల్లా నగరం మండలానికి చెందిన ఈయన ఏఆర్ కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో విధుల్లో చేరారు. 2018లో ఆర్‌ఎస్సైగా పదోన్నతి పొంది నెల్లూరుజిల్లాకు వచ్చారు. ఈ ఏడాది ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా పతకం అందుకోనున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉగాది పురస్కారాల్లో ఆయనను సేవా పతకం వరించింది.

శ్రీను గల్పిక

# టెన్ జనపథ్‌లో ఆకాశాన్నంటిన సంబరాలు

ఢిల్లీలోని టెన్ జనపథ్... కొన్ని వేలమంది కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడ గుమికూడి వున్నారు. కొందరు ఆనందంతో గంతులు వేస్తుండగా, ఇంకొందరు డ్రమ్స్ వాయిస్తున్నారు. మరికొందరు హోళీ పండుగలాగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటున్నారు. అప్పుడే విహెచ్ హనుమంతురావు బాణాసంచా పదివేల సరాలను తెచ్చి బయట రోడ్డుమీద పెట్టి నిప్పు పెట్టాడు. టపాసుల మోతలతో ఆ ప్రాంతం దద్దరిల్ల సాగింది. టెన్‌జనపథ్‌కు వరుసబెట్టి కార్లు రాసాగాయి. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో పాటు కాంగ్రెస్ అతిరథులు గులాంనబీ ఆజాద్, అహ్మద్‌పటేల్, మనీష్ తివారి, ఆనంద శర్మ, అంబికా సోని, కపిల్ సిబల్, మల్లిఖార్జున ఖర్గే వంటి నాయకులంతా అక్కడకు చేరుకున్నారు. అందరూ లోపలకు వెళ్లారు. అక్కడ సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ, వాద్రాల ముఖాలు ఆనందంతో వెలిగిపోతున్నాయి. అప్పుడే సైక్లింగ్ ముగించుకుని సైకిల్ తొక్కుకుంటూ రాహుల్‌గాంధీ అక్కడకు వచ్చాడు. అక్కడ జరుగుతున్న హడావిడంతా చూసి ఆశ్చర్యంగా... ఏంటమ్మా ఇది, కొంపదీసి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలోగాని మన పార్టీ గెలిచిందా అని అడిగాడు. అక్కడే వున్న అంబికా సోని కలుగజేసుకుని... అంతకన్నా ఆనందకరమైన విశేషం బాబూ... ఇంతకాలం పెళ్లి పెటాకులు లేకుంటే నిన్నెందుకూ పనికిరాని వాడివనుకునేవాళ్ళుం... కాని, నువ్వేంటో, నీ సత్తా ఏంటో మాకు ఈరోజే తెలిసింది. నువ్వు పనికిమాలినవాడివేమీ కాదని, భవిష్యత్‌లో పనికొస్తావని నీ మీద మీ అమ్మకు కూడా నమ్మకం కలిగింది అని అంది. రాహుల్ చిరాగ్గా సుత్తి లేకుండా సూటిగా ఏం జరిగిందో చెప్పండి అని కసిరాడు. అక్కడేవున్న విహెచ్ హనుమంతురావు... పొదిగిన గుడ్డు పిల్లయినప్పుడు ఆ కోడి తల్లి ఎంత ఆనంద పడుతుందో తెలుసా బాబు... ఇప్పుడు నీ తల్లి పరిస్థితి కూడా అదే... అని అన్నాడు. అది విని రాహుల్‌కు అరికాల్లో మండింది... విషయం చెప్పకుండా ఈ సోదంతా ఏంటి అని సీరియస్‌గా అన్నాడు. వెంటనే విహెచ్ హనుమంతరావు తన చేతిలో వున్న స్వీట్ బాక్సులో నుండి ఒక లడ్డు తీసి... తీపి కబురు వినే ముందు ఈ తియ్యటి లడ్డును నోట్లో వేసుకో బాబు అంటూ ఒక లడ్డు చేతికిచ్చాడు. రాహుల్ ఆ లడ్డును తింటూ... మీరంతా ఇంత హ్యాపీగా వున్నారంటే నాకు ఒకటనిపిస్తుంది.. కాంగ్రెస్‌పార్టీని మూసేయాలని మమ్మీ నిర్ణయం తీసుకుంది కదూ.. పార్టీ మూసేస్తే ఇక నాకు ఏ తలనొప్పి వుండదు, హ్యాపీగా ఫారిన్ టూర్లు ఎంజాయ్ చేసుకుంటుండొచ్చు... యామ్ ఐ కరెక్ట్ అని అడిగాడు. అందుకు విహెచ్... శుభం పలకరా అంటే అదేదో అన్నాడంట నీలాంటోడు... నీకు విషయం చెప్పకపోతే పార్టీకే మంగళం పాడేట్లున్నావ్, ఏం లేదు బాబు... ఐఏఎన్ఎస్ – సీ ఓటర్ రిపబ్లిక్‌డే స్టేట్ ఆఫ్ నేషన్ వారు నిర్వహించిన సర్వేలో ప్రజాదరణలో మీరు దూసుకుపోయారు, మీ తల్లిని కూడా మించిపోయారు. అందుకే ఈ ఆనంద సంబరాలు, ఇక ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఈ ప్రజాదరణతో కాంగ్రెస్ గెలిచిపోద్ది, మీరు ప్రధాని అయిపోతారు, సాయంత్రం మన మిత్రపక్షాల వాళ్ళను కూడా రమ్మన్నాం.. అందరి సమక్షంలో మీకు సన్మాన సభ వుంది అని చెప్పాడు.

★★★★★

ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీ, పార్టీ అధ్యక్షుడు జె.పి.నడ్డా, హోంమంత్రి అమిత్‌షా, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయుష్ గోయెల్, సురేష్ ప్రభు, సదానంద గౌడ్ వంటి వారున్నారు. అమిత్‌షా వుండి... రాహుల్‌కు సడెన్‌గా అంత క్రేజ్ ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. ఇటీవల అతను ప్రదర్శించిన స్పెషల్ పెర్ఫార్మెన్స్ కూడా ఏమీ లేదన్నాడు. మోడీ వుండి... ప్రజాదరణలో అతను మన కన్నా ముందుకు దూసుకుపోతే వచ్చే ఎన్నికల్లో మనకు గెలుపు కష్టమే... అందుకని ఈసారి పాకిస్థాన్‌తో పాటుగా బంగ్లాదేశ్ మీద కూడా నాలుగు బాంబులేయాల్సి వుంటుంది... ఇంతకీ ఆ ఐఏఎన్ఎస్ – సీ ఓటర్ సర్వేను నువ్వు క్లియర్‌గా చూశావా అని అడిగాడు. మనం ప్రత్యేకంగా చూడాలా.. ఆ టెన్‌జనపథ్ వద్ద జరుగుతున్న సంబరాలను చూస్తుంటే రాహుల్ ప్రజాదరణలో మిమ్మల్నే కాదు, డోనాల్డ్ ట్రంప్, పుతిన్, మడొన్నాలను కూడా మించిపోయినట్లున్నాడు అని అమిత్‌షా అన్నాడు. ఆ మాటకు మోడీ నిరాశతో తల వేలాడేశాడు.

★★★★★

టెన్‌జనపథ్... సాయంత్రమైంది. అక్కడ ఒక పెద్ద స్టేజీ కట్టి వున్నారు. కుర్చీలలో కార్యకర్తలు కూర్చుని వున్నారు. తెలుగుదేశం అధినేత, హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, డిఎంకె అధినేత స్టాలిన్, శివసేన అధినేత ఉద్ధవ్ థాక్రే, ఎన్‌సిపి అధినేత శరద్‌పవార్, సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్‌యాదవ్, బిఎస్పీ అధినేత్రి మాయావతి, దళ్(ఎస్) అధినేత కుమారస్వామిలు వచ్చారు. అందరి చేతుల్లోనూ శాలువాలు, బొకేలు వున్నాయి. మాయావతి వెళ్లి రాహుల్ భుజం తడుతూ... ఇంతకాలం మోడీని ఢీకొట్టే మొనగాడు లేడనుకున్నాం... సరైనోడివి వచ్చావ్ అని అభినందించింది. అందరూ రావడంతో రాహుల్‌కు అభినందన సభ మొదలైంది. వేదిక మీదున్న నాయకులు ఒక్కొక్కరు రాహుల్‌ను ఆకాశానికెత్తుతూ మాట్లాడారు. అందరి ప్రసంగాలు అయిపోయాక రాహుల్‌ను పెద్ద సింహాసనం మీద కూర్చోపెట్టి సన్మానం చేయడానికి సిద్ధపడుతున్నారు. అప్పుడే అక్కడే ఏర్పాటు చేసివున్న టీవీలో వార్తల విరామంలో వాణిజ్య ప్రకటనలు రాసాగాయి. ఎంటిఆర్ గులాబ్‌జామ్ యాడ్ అది... స్కూల్ నుండి ఓ పిల్లాడు చేతిలో కప్‌తో ఇంటికొచ్చి.. అమ్మా, నేను రన్నింగ్ రేస్‌లో సెకండ్ వచ్చాను అని అంటాడు. తల్లి మురిసిపోయి ఎంటిఆర్ గులాబ్‌జామ్ చేసి పిల్లోడికి పెడుతుంది... పిల్లోడు తింటుండగా... ఇంతకీ రేస్‌లో ఎంతమంది పాల్గొన్నారు నాన్న అని అడుగుతుంది. 'ఇద్దరు అంటూ ఆ పిల్లోడు పరుగెడతాడు.

ఈ యాడ్‌ను చూడగానే మమతా బెనర్జీ ఆలోచన మారింది. ఇతను ఏం పొడిచాడని ప్రజాదరణలో మాకంటే ముందుకు దూసుకుపోతాడు, అదీగాక నరేంద్ర మోడీ లాంటివారిని దాటడమేంటి అనే అనుమానంతో వెంటనే ఐఏఎన్ఎస్–సీ ఓటర్ సర్వే సంస్థ ప్రతినిధికి ఫోన్ చేసింది. రాహుల్ ప్రజాదరణలో ముందున్నారని చెప్పారు.. మోడీ కంటే ముందున్నాడా? అసలు ఎంతమంది మీద సర్వే నిర్వహించారు? అని ప్రశ్నించింది. దానికి అవతల వ్యక్తి... మోడీ కంటే కాదు కదా, మీకన్నా కూడా ముందు కాదు మేడమ్, రాహుల్, లోకేష్‌ల మధ్య సర్వే నిర్వహించాం... లోకేష్ కంటే రాహులే నయమని మా సర్వేలో తేలింది అని చెప్పాడు. వెంటనే మమతా ఫోన్ పెట్టేసి, స్టేజీ వైపు చూసింది. అక్కడ రాహుల్‌కు చంద్రబాబు శాలువా కప్పబోతున్నాడు. మమతా బెనర్జీ విసురుగా స్టేజీ ఎక్కి ఆ శాలువాను లాక్కుని జరిగిన విషయం మైకులో చెప్పింది. ఈ మాత్రం దానికేనా ఇంత హంగామా... మాకెందుకు శాలువాలు బొక్క అనుకుంటూ ఎవరి శాలువాలు వాళ్ళు కవర్లలో పెట్టుకుని తిరిగి బయల్దేరారు.

# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా


జెండా వందనం చేస్తున్న విశ్వసాయి విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్.సత్యనారాయణ


కేడెట్లకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కృష్ణచైతన్య కళాశాల డైరెక్టర్ ఆర్వి కృష్ణారెడ్డి

71వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జనవరి 26వ తేదీన జిల్లావ్యాప్తంగా రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఎంతో ఉత్సాహంతో ప్రజలు గణతంత్ర వేడుక జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, పలు విద్యాసంస్థల్లోనూ ఈ వేడుకలు కోలాహలంగా జరిగాయి. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిఇఓ జనార్ధనాచార్యులు జాతీయపతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధి నిర్వహణ చేయాలని ఆయన ఈ సందర్భంగా ఉద్యోగులకు సూచించారు.

నెల్లూరు నగరంలోని డికెడబ్ల్యు కాలేజీలో ప్రిన్సిపాల్ మస్తానయ్య జాతీయపతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. వేదాయపాళెంలోని ఎల్ఎల్ఎఫ్ పాఠశాలలో కరెస్పాండెంట్ ఇ.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. రత్నం విద్యాసంస్థల్లో జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. రత్నం విద్యాసంస్థల ప్రతినిధులు అజయ్‌సింగ్, డి.వసుంధర, సుధ, జాస్మిన్, నాగేంద్ర, రుక్మిణి, వసంత, రవీంద్ర, కల్యాణి, రాజేష్‌బాబు, రాధాకృష్ణ, లక్ష్మి, సుప్రియ, ప్రపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని విశ్వసాయి జూనియర్ కాలేజీలో గణతంత్ర వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అదేవిధంగా పడారుపల్లి క్యాంపస్‌లో డైరెక్టర్ జి.కృష్ణమోహన్ జాతీయజెండాను ఆవిష్కరించారు. విశ్వసాయి డాక్టర్ ఎస్ఆర్‌కె స్కూల్‌లో విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులురెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా క్రికెట్‌పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఏవిఎస్ కృష్ణప్రసాద్, రిజిస్ట్రార్ సాంబశివరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.విశ్వక్‌సేనారెడ్డి, కన్వీనర్ టిపి వరప్రసాద్, పి.డి ప్రసాద్, ఏఓఎం బివి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ, పీజీ కాలేజీల్లో ఆ విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.కృష్ణారెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. విద్యాసంస్థల నిర్వాహకులు ఆచార్య ఆదిత్య, డి.పుల్లయ్య, కె.అంకయ్య, సిహెచ్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కృష్ణచైతన్య డిగ్రీ కాలేజీలో రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఆర్వి కృష్ణారెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్స్ కృష్ణకుమార్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించిన వేదవ్యాస స్కూల్ చిన్నారులు

మాగుంట లేఅవుట్‌లోని వేదవ్యాస స్కూల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు సందడిగా జరిగాయి. స్కూల్ కరెస్పాండెంట్ ఏ.వి బాలాజీ పాల్గొని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలతో అందరినీ అలరించారు. స్కూల్ డైరెక్టర్ ఏ.పి వేదగిరి పాల్గొన్నారు.

రెయిన్‌బో సిబిఎస్ఇ పాఠశాలలో డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జాతీయజెండాను ఆవిష్కరించి గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్స్ బద్దెపూడి హరిత, సురేఖారెడ్డి పాల్గొన్నారు. నేతాజీ పైలెట్ స్కూల్‌లో డైరెక్టర్ కె.నరేంద్రరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు ప్రసన్న, ఎస్‌వియల్ నరసింహారావు, వైస్ ప్రిన్సిపాల్ వాణి తదితరులు పాల్గొన్నారు. చంద్రమౌళినగర్‌లోని మైథిలి స్కూల్‌లో పాఠశాల వ్యవస్థాపకుడు బి.మనోహర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కరెస్పాండెంట్ మైథిలి పాల్గొన్నారు. నగరంలోని నవాబుపేట యుఎన్ఆర్ పాఠశాలలో కరెస్పాండెంట్ యు.నరసారెడ్డి ఆధ్వర్యంలో రిపబ్లిక్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

# వికేంద్రీకరణతోనే.. అభివృద్ధికి మార్గం

## - ఎన్‌బికెఆర్‌లో జరిగిన అవగాహన సదస్సులో వక్తలు




అభివృద్ధిని కేవలం ఒక్క ప్రాంతానికే పరిమితం చేయకుండా పరిపాలనను వికేంద్రీకరించినట్లయితే అసమానతలు తొలగిపోయి అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయని కావలి జవహర్ భారతి కళాశాల ప్రొఫెసర్ కృష్ణప్రసాద్ అన్నారు. ఈనెల 28న కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో 'మూడు రాజధానుల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు' అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ పరిపాలన సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేస్తున్న మూడు రాజధానులను సమర్థిస్తున్నానన్నారు. కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్ర వికేంద్రీకరణ ఒక్కటే రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల ప్రెసిడెంట్‌గా, పార్టీ కార్యకర్తగా రాష్ట్ర అభివృద్ధికి కావాల్సిన సలహాలు, సూచనలను ముఖ్యమంత్రికి అందించడానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ రాజగోపాల్, నెల్లూరు సంస్కృత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డా. నరసింహారెడ్డిలు మాట్లాడుతూ అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరుగుతూ ప్రజల సర్వతోముఖాభివృద్ధికి మూడు రాజధానులు ఎంతో ఉపయోగకరమన్నారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

### విశ్వసాయి డా. యస్ఆర్‌కె స్కూల్‌లో

# సైన్స్ అండ్ హెరిటేజ్ ఎక్స్‌పో



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో వున్న విశ్వసాయి డాక్టర్ యస్ఆర్‌కె స్కూల్‌లో సైన్స్ అండ్ హెరిటేజ్ ఎక్స్‌పో ఈనెల 25, 26 తేదీలలో జరిగింది. నెల్లూరు డీఇఓ యం.జనార్ధనాచార్యులు, సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.బ్రహ్మానందరెడ్డి దీనిని ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో శ్రీహరికోట షార్ నుంచి వచ్చిన రాకెట్, శాటిలైట్ నమూనాలు, హైదరాబాద్ నుంచి తెచ్చిన అనేక రోబోలు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. వృక్షశాస్త్ర నమూనాలు, అనేక రకాల మొక్కలు, మానవ అవయవాలు, భిన్న రకాల జంతువులు, ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణిత శాస్త్ర నమూనాలు, ఆర్ట్స్, పెయింటింగ్స్, స్కిల్ గేమ్స్, వివిధ వేషధారణలు, వివిధ సంప్రదాయ రీతులకు ప్రతిబింబాలుగా ఏర్పాటు చేసిన చర్చి, మసీదు, దేవాలయ నమూనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డీఇఓ జనార్ధనాచార్యులు, పీడీఓ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో అధ్యయన కుతూహలాన్ని పెంపొందింపజేస్తాయన్నారు. విశ్వసాయి ఛైర్మన్ డా. ఎన్.సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ కృష్ణమోహన్, ఛైర్‌పర్సన్ రుక్మిణి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఫ్రెండ్స్ వాకర్స్' కొత్త కార్యవర్గం



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జనవరి 30వతేదీ వెలమసంఘం భవన్‌లో జరిగింది. అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షులుగా నలుబోలు బలరామయ్యనాయుడు, అధ్యక్షులుగా జి.వి.కృష్ణయ్య, కార్యదర్శిగా బి.శ్రీమన్నారాయణ, కోశాధికారిగా వి.లక్ష్మీనారాయణ, జాలీవాకర్‌గా ఐ.సోనుతో పాటు సంయుక్తకార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కార్యవర్గసభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.రాఘవేంద్రషెట్టి కొత్త కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు జి.వి.కృష్ణయ్య తన ప్రసంగంలో గత అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు చేసిన సేవా కార్యక్రమాలను అభినందిస్తూ, తాము కూడా ఆయన బాటలో నడుస్తామన్నారు. వీరిశెట్టి హజరత్‌బాబు, బి.మనోహర్‌రెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి, డాక్టర్ కె.అంకిరెడ్డి, వై.రాఘవరెడ్డి, ఎస్.మురళీమోహన్, ఎం.సుధాకర్‌రెడ్డి, శేషగిరిరావు, లక్ష్మణరెడ్డి, వి.వెంకటేశ్వర్లు, కె.సుబ్బారావు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# పూండ్ల సుబ్బారెడ్డి



ఆకాష్ కేబుల్ నెట్‌వర్క్(ఏసిఎన్) వ్యవస్థాపకులు పూండ్ల శివకుమార్‌రెడ్డి తండ్రి పూండ్ల సుబ్బారెడ్డి జనవరి 27వ తేదీన అనారోగ్యంతో స్వర్గస్థులైనారు. ఆయన వయసు 86 సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు దశాబ్దాల క్రితమే కేబుల్ టీవీని నెల్లూరీయులకు పరిచయం చేసి, ఏసిఎన్ శివకుమార్ రెడ్డిగా అందరికీ సుపరిచితుడే. రెండో కొడుకు శిరీష్‌రెడ్డి అమెరికాలో స్థిరపడ్డాడు. కొడవలూరు మండలం, యల్లాయపాలెం ఆయన స్వగ్రామం. ప్రభుత్వ సర్వీసులో వుండి రిటైర్ అయిన ఆయన, నెల్లూరు, మాగుంట లే అవుట్‌లో చాలాఏళ్లుగా నివసిస్తూ, స్థానికులలో వాకర్ పితామహుడిగా గుర్తింపు పొందారు. వాకింగ్ ద్వారా అన్ని వయస్సులకు చెందిన ఎంతోమంది ఆయనకు సుపరిచితులయ్యారు. చాలామంది ఆయనను వాకింగ్ గురువుగా భావించేవాళ్లు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో


# ఫిబ్రవరి 1 నుండి కుంభాభిషేకాలు



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన శ్రీ వాసవీ కన్యాకా పరమేశ్వరీ అమ్మ వారి మహా కుంభాభిషేకాలు ఫిబ్రవరి 1 నుండి 5వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఆలయాన్ని 1898లో నిర్మించారు. దాదాపు 122 ఏళ్ళ తర్వాత ఆలయం జీర్ణావస్థకు చేరింది. నెల్లూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, ఆలయ పాలకమండలి సభ్యులు, ఆర్యవైశ్య భక్తుల కోరిక మేరకు ఆలయ జీర్ణోద్ధరణకు నడుం బిగించారు. దాతల సహకారంతో పాత ఆలయాన్ని పూర్తిగా తొలగించి. వివిధ రకాల కళాకృతులతో విశాలంగా తీర్చిదిద్దుతున్నారు. తూర్పు రాజ గోపురం, ఉత్తర గోపురం, ప్రధాన ఆలయాలు, ఉప ఆలయాలు నిర్మించారు. అమ్మవారి సన్నిధికి వెనుక వైపున పరివార దేవతలు, నవగ్రహ మండపం, సన్నిధికి చుట్టూ వరండా పూర్తయ్యాయి. ప్రతిష్టాత్మకంగా అమ్మవారి అంతరాలయం సీలింగ్‌కి ఢిల్లీ నుంచి ప్రత్యేక కళాకారులతో మిరుమిట్లు గొలిపే అద్దాల నగిషీలు ఏర్పాటు చేశారు. ముఖద్వారం మండపంపై పాలరాతి విగ్రహాల్ని జైపూర్ నుంచి తెచ్చి ప్రతిష్టించారు. ఆలయానికి నాలుగు వైపుల అమ్మవారి మహిమల్ని తెలియజేసే ప్రతిమలతో సాలహారాలు ఏర్పాటు చేస్తున్నారు. ఫిబ్రవరి 1 నుండి 5వ తేదీ వరకు దేవతామూర్తుల ప్రతిష్ట, విమాన గోపురాల కలశ స్థాపన, మహాకుంభాభిషేకాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామి విచ్చేస్తున్నారు. ఆంధ్రరాష్ట్రానికే తలమానికంగా ఈ ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నారు.

# వైయస్సార్ కంటి వెలుగు మూడో దశ 15న

వైయస్సార్ కంటి వెలుగు మూడో దశ ఫిబ్రవరి నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానుందని, ఈ దశలో 60 ఏళ్ళు పైబడిన వారికి ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్లు ప్రభుత్వం, ప్రైవేటు (ఎన్జీవో) సంస్థల సహాయంతో విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్–2 కమలకుమారి ఆదేశించారు. ఈనెల 29న కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వైద్య ఆరోగ్యశాఖ, వైద్య విధాన పరిషత్, జిల్లా అంధత్వ నివారణ సంస్థల అదికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఆశ, ఏఎన్ఎం, ఆప్తాల్మిక్ సహాయకులచే నిర్ధేశించిన ప్రదేశాలలో, పాఠశాలలు, అంగన్‌వాడీ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డీఎంహెచ్ ఓ, పీవోడీటీటీ డాక్టర్ ఉమామహేశ్వరి, జిల్లా పంచాయితీ అధికారి ధనలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ సుబ్బారావు డివిజనల్ ప్రోగ్రాం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ - 2 కమలకుమారి

# ట్రెజరీ ఉద్యోగుల ఆటల పోటీలు

రిపబ్లిక్ డేను పురస్కరించుకుని నెల్లూరు జిల్లాలోని ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ట్రెజరీ అధికారులు, సిబ్బందికి ఆటల పోటీలను ఈనెల 24న నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా మహిళా ఉద్యోగులు, సిబ్బందికి కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రికెట్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, స్కిప్పింగ్, రన్నింగ్, లెమన్ స్పూన్ తదితర క్రీడలను నిర్వహించారు. ఈ పోటీలను డీడీ రామచంద్ర ప్రారంభించారు. పురుషులకు సంబంధించిన పోటీల్లో ట్రెజరీ టైగర్స్ టీం విజేతగా నిలిచింది. మహిళా ఉద్యోగులకు సంబంధించి స్కిప్పింగ్ లో లిఖిత, మమత, ముగ్గుల పోటీల్లో శారద, ప్రసూన, అనూష, తేజోవతి, నిఖిత, రేవతి విజేతలుగా నిలిచారు. 200 మీటర్ల పరుగు పందెంలో ప్రసూన, సుప్రియ, విజేత, లెమన్ అండ్ స్పూన్ లో సుప్రియ, ప్రసూన తదితరులు విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్నారు.

# ఈఈ సేవలు అభినందనీయం



ఈఈ కాంతారావును సత్కరిస్తున్న షేక్ రియాజ్‌అహ్మద్ తదితరులు

గణతంత్ర దినోత్సవాని పురస్కరించుకుని ఉత్తమ సేవా అవార్డు అందుకున్న పంచాయితీరాజ్ ఈఈ కాంతారావును గూడూరులోని ఆ శాఖా కార్యాలయంలో పంచాయితీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం నాయకులు ఇటీవల సన్మానించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్ మాట్లాడుతూ పంచాయితీరాజ్ శాఖలో గూడూరు డివిజన్ ప్రథమ స్థానంలో ఉండేందుకు ఈఈ కాంతారావు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. గ్రామ సచివాలయాల ఏర్పాటులో ఈఈ చేసిన కృషితో జిల్లాలో పంచాయితీరాజ్ శాఖ నుండి గూడూరు ఇంజనీర్లు మాత్రమే అవార్డు అందుకున్నారని తెలియజేశారు. భవిష్యత్తులో రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకోవాలని కోరుకుంటున్నానన్నారు. అనంతరం ఈఈని, ఆయనతో పాటు అవార్డు అందుకున్న ఏఇ మల్లికార్జున్‌రావుని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డి.ఇ కృష్ణబాబు, అధికారులు గిరినాథ్, మస్తానయ్య, వెంకయ్య, ప్రవీణ్‌కుమార్, సంధ్య, గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

# 1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

### - పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు

జిల్లాలో ఫిబ్రవరి 1 నుంచి 20వతేది దాకా నాలుగు విడతలుగా ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలంటూ జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జున సంబంధిత అధికారులకు సూచించారు. ఈ నెల28న కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో ఏర్పాటుచేసిన సమావేశంలో అధికారులతో ఆయన చర్చించారు. నెల్లూరు డివిజన్‌లోని 23సెంటర్లు, కావలి డివిజన్ పరిధిలో 15సెంటర్లు, గూడూరు డివిజన్‌లో 10 సెంటర్లలో ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు ఎంపిసి విద్యార్థులు 19,802 మంది, బైపీసీ విద్యార్థులు 4,692 మంది, ఒకేషనల్ విద్య మొదటి సంవత్సరం విద్యార్థులు 1258 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 960 మంది హాజరు కానున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా పరీక్షాకేంద్రాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రాక్టికల్ పరీక్షలను సిసి కెమెరాలతో ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలకు సంబంధించి ఏమైనా సమస్యలున్నట్లయితే 0861–2320312 నెంబరుకు ఫోన్‌చేసి తగు సూచనలు పొందాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐఓ కె.శ్రీనివాసరావు, పరీక్షల పరిశీలకుడు బి. వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంచలనాలు.. జగన్ సాహసాలు!

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీవాడే కావడంతో ఈ బిల్లులను ఎలాగైనా ఆపాలని చంద్రబాబు ప్లాన్ చేశాడు. 'అమరావతి' రాజధాని కాదన్నప్పటి నుండి ఆయనకు కంటిమీద కునుకు లేకుండాపోయింది. అమరావతిని హైదరాబాద్ మాదాపూర్ తరహాలో రియల్ఎస్టేట్ కేంద్రంగా మార్చుకోవాలనుకున్నాడు. జగన్ ఆయన కలలను చిందరవందర చేశాడు. ఇక 3 రాజధానుల బిల్లును అడ్డుకోవాలంటే చంద్రబాబు చేతిలో వున్న చివరి ఆయుధం మండలి ఛైర్మెన్ ఎంఎ షరీఫ్. నిబంధనల ప్రకారమైతే శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులను శాసన మండలిలో చర్చించాలి, సవరణలు ప్రతిపాదించవచ్చు, లేదంటే తిరస్కరించవచ్చు. ఇది పద్ధతిగా జరిగే ప్రక్రియ.

కాని, ఇక్కడ ఛైర్మెన్‌కు వున్న విచక్షణాధికారాలను చంద్రబాబు తన స్వార్థానికి ఉపయోగించుకున్నాడు. మాజీ ముఖ్యమంత్రి హోదాలో శాసనమండలి గ్యాలరీలో కూర్చుని మండలి ఛైర్మెన్ ఎంఎ షరీఫ్‌ను తన కనుసైగలతో శాసించాడు. ఛైర్మెన్ తన విచక్షణాధికారాలను ఉపయోగించుకుని ఈ బిల్లులను సెలక్ట్ కమిటీకి పంపేలా చేయగలిగాడు.

ముఖ్యమంత్రికి, ఇతర సహచర సభ్యులకే కాదు, రాజ్యాంగ నిపుణులకు, రాజకీయ మేధావులకు కూడా ఈ విషయంలో బాగా మండింది. ప్రజల చేత ఎన్నుకోబడ్డ సభ ఆమోదించిన బిల్లులను, ప్రజల చేత ఎన్నుకోబడని సభ్యులుండేటటువంటి సభ అడ్డుకోవడమేంటనే ప్రశ్న వచ్చింది. అంతేకాదు, చంద్రబాబు స్వార్ధం కోసమే మండలి ఛైర్మెన్ తన విచక్షణాధికారాలను వాడుకున్నాడన్న విషయం ఇక్కడ స్పష్టంగా తెలిసిపోయింది. దాంతోనే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి ప్రక్రియ బిల్లులను అడ్డుకునే మండలి అవసరం లేదంటూ దాని రద్దుకు పచ్చజెండా ఊపాడు.

### 50 మంది మాజీలు...

చంద్రబాబు చేసిన పనికి 50 మంది ఎమ్మెల్సీలు మాజీలు కాబోతున్నారు. ఇందులో చంద్రబాబు కొడుకు నారా లోకేష్ కూడా వున్నాడు. ఇంకెంతోమందికి రావాల్సిన ఎమ్మెల్సీ పదవుల అవకాశాలకు కూడా చంద్రబాబే గండికొట్టినట్లయ్యింది.

### నాడు ఎన్టీఆర్... నేడు జగన్

1983లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు శాసన మండలిని రద్దు చేశాడు. ఆ తర్వాత 1989లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా దానిని పునరుద్ధరించలేదు. 1995 నుండి 2004 వరకు సీఎంగా వున్న చంద్రబాబు కూడా మండలిని తిరిగి తేలేదు. 2007లో నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖరరెడ్డి శాసనమండలిని తిరిగి తెచ్చాడు. అప్పుడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కావడంతో 90స్థానాలతో శాసన మండలిని ప్రారంభించారు. చుక్కా రామయ్య, ప్రొఫెసర్ నాగేశ్వర్, కె.రోశయ్య లాంటి మేధావులకు, నిపుణులకు మండలిని ఒక వేదికగా మలిచారు. వైయస్ తర్వాత ముఖ్యమంత్రులైన కె.రోశయ్య కూడా ఎమ్మెల్సీ హోదాలోనే సీఎం కుర్చీలో కొనసాగాడు. ఆరోజు ఎన్టీఆర్ రద్దు చేసిన మండలిని వైయస్ రాజశేఖర రెడ్డి పునరుద్ధరిస్తే, ఈరోజు ఆయన తనయుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డి దానిని మళ్ళీ రద్దు చేశాడు.

### కేంద్రం ఆమోదం లాంఛనమే!

రాష్ట్ర శాసనసభ ఆమోదించిన మండలి రద్దు తీర్మానాన్ని పార్లమెంటు ఆమోదించాలి, కేంద్ర ప్రభుత్వం అంగీకరించాలి, రాష్ట్రపతి సంతకం చేయాలి... అయితే ఇవన్నీ లాంఛనమే! కేంద్రం మండలి రద్దుకు సన్నద్ధంగా వుంది.

### వాళ్లిద్దరూ ఔట్...

శాసనమండలి రద్దుతో జగన్ మంత్రి వర్గం నుండి ఇద్దరు వైదొలగాల్సి వుంటుంది. ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, బి.సి సంక్షేమ శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణలు తమ మంత్రి పదవులు కోల్పోనున్నారు. అయితే ఎన్నికలలో గెలవనప్పటికీ జగన్మోహన్‌రెడ్డి వీరిని మంత్రివర్గంలోకి తీసుకుని ఎమ్మెల్సీలను చేశాడు. జగన్ తమ పట్ల చూపిన ప్రేమకు కృతజ్ఞతగా వీళ్ళు తమ పదవులను వదులుకోవడానికి సిద్ధమయ్యారు.

### నష్టం వైసిపికే...

ఈరోజు శాసనమండలిలో తెలుగుదేశంకు మెజార్టీ ఉండొచ్చు, ఇంకో సంవత్సరం ఆగితే వచ్చే ఎమ్మెల్సీ పదవులన్నీ కూడా వైకాపా ఖాతాలోనే చేరుతాయి. ఇంకో నాలుగేళ్ళ తర్వాత మండలిలో చూస్తే తెలుగుదేశం పార్టీ నుండి ఒక్క సభ్యుడు కూడా వుండకపోవచ్చు. వైసిపికి మండలిలో అంత బలం పెరిగే అవకాశముంది. ఇది తెలిసి కూడా జగన్ మండలి రద్దుకే ముందుకు పోయాడు. కారణం... ఇలాంటి బిల్లులను అడ్డుకోవడంతో పాటు, మండలి నిర్వహణకు ఖర్చు దండగ అనే కోణంలో ఆలోచించడం వల్లే!



### హారన్..

అంబులెన్సుకు
అమాత్యుల ఆగమనానికి
ఒకటే హారన్.
ఒకటి ప్రాణం పోయడానికి..
మరొకటి కొంప కూల్చడానికి..

-చిన్ని నారాయణరావు.

మెయింటెనెన్స్ అంటూ రెండేళ్ళకు 8,10,000లు వుంటే ఇది 2016-17లో మాత్రం 31,27,000/- ఉంది. అవి ఏమి పరికరాలు, అంత ఎందుకు అవుతుంది..?

**3. కార్యాలయ ఖర్చులు :** 2017-18లో 62లక్షల 77వేలు చూపిస్తే, 2018-19లో 67 లక్షలా 52వేలు ఖర్చు చూపించారు. అయితే ఇది 2016-17లో కేవలం 6లక్షలా 66వేలు మాత్రమే వుంది.

2016-17లో కేవలం 6,66,000/- వుంటే 2017-18కి 62,77,000 అయ్యి మళ్ళీ 2018-19కి 67,50,000కు చేరింది. అంటే 2016-17 కంటే 2017-18, 2018-19 సంవత్సరాలలో ఇది 8రెట్లు పెరిగింది. ఒక్కసారిగా ఆఫీసు ఖర్చులు అంత ఎందుకు పెరిగాయో ఈ గోల్‌మాల్ గోవిందయ్యలే చెప్పాలి.

**4. జీతాలు మరియు గౌరవ వేతనాలు :** 2017-18లో 2కోట్ల 32 లక్షలా 25వేలు కాగా 2018-19లో ఇది 2కోట్ల 84లక్షలా 55వేలకు పెరిగింది.

జీతాలు మరియు గౌరవవేతనాలు అంటూ 2017-18 మరియు 2018-19 కలిపి 5,16,80,000/- ఖర్చు చేశారు. జీతాలు సరే తప్పదు... మరి గౌరవ వేతనాల పేరుతో ఈ గీతాలు ఎవరికి వెళ్ళాయి. ఎందుకు వెళ్ళాయి? ఎవరిని గౌరవించారు, ఎవరికి వేతనాలు చెల్లించారు? రెడ్‌క్రాస్ అంటే సేవా దృక్పథంతో పనిచేయాలి కాని, ఇలా గౌరవ వేతనాలంటూ దాతల డబ్బును మింగే అధికారం వీళ్ళకి ఎవరిచ్చారు. ఈ జీత గీతాలలో సగం.. అంటే 2,37,00,000/- రూపాయలు ఒక్క అనుబంధ సంస్థలోనే ఖర్చు చేయడం గమనార్హం.

**5. వాహనాల మెయింటెనెన్స్ :** 2017-18లో 4లక్షలా 93వేలు కాగా 2018-19లో 4లక్షలా 57వేలు వుంది.

వాహనాల మెయింటెనెన్స్ అంటూ 2017-18 మరియు 2018-19లో 9,50,000/- ఖర్చు చేశారు. అదే 2016-17లో 8,58,000/- ఖర్చు చేశారు. ఇంతింత డబ్బులు వాహనాల మెయింటెనెన్స్‌కి ఖర్చు చేస్తున్నారంటే అసలు వీరికి ఎన్ని వాహనాలున్నాయి, అవి ఏ స్థాయి బ్రాండ్ కలిగినవో వీరే జవాబు చెప్పాలి..?

**6. స్టేషనరి :** 2017-18లో 13లక్షలా 83వేలు కాగా 2018-19లో 15లక్షలా 94 వేలకు పెరిగింది.

స్టేషనరీ ప్రింటింగ్ అంటూ రెండేళ్ళకు 29,77,000/- అంటే నెలకు 1,24,000 ఖర్చు చేస్తున్నారు. ఓ వైపు ఆఫీసు మెయింటెనెన్స్ అంటూ లక్షలకు లక్షలు ఖర్చు చేస్తూనే మరోవైపు ప్రింటింగ్ ఖర్చులంటూ నెలకు లక్షా ఇరవై వేలు ఖర్చు పెట్టడం ఎందుకోసమో వీళ్ళే చెప్పాలి..?

**7. కన్సల్టెన్సీ :** 2017-18లో 85 లక్షలా 16వేల రూపాయలు చెల్లిస్తే 2018-19లో 94 లక్షలా 25వేలు చెల్లించారు.

కన్సల్టెన్సీ అంటే విజిటింగ్ డాక్టర్ లేదా ఇతర సలహాదారులు. వీరికి రెండేళ్ళలో ఇచ్చింది 1,79,00,000/-. అంటే జీతాలు గౌరవ వేతనాలతో సంబంధం లేకుండా మళ్ళీ కేవలం సలహాలకు సంప్రదింపులకు నెలకు 7,47,000 ఖర్చు చేస్తున్నారంటే ఇది ఎవడబ్బ సొమ్మని వీరి ఇష్టారాజ్యంగా ఖర్చుపెడుతున్నారో నిర్వాహకులే చెప్పాలి.

# కోట్లు దోచేసుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

**8. ఇతర(చిల్లర) ఖర్చులు :** 2017-18లో 1కోటి 72లక్షల 71వేలైతే, 2018-19లో ఇది 1 కోటి 71లక్షల 51వేలు వుంది. ఈ లెక్కలమాంత్రికులు చూపించిన రెండు సంవత్సరాల పద్దు పరిశీలిస్తే మనకు అర్థంకాని చిక్కులు, మనం పూడ్చలేని బొక్కలు ఎన్నో కనిపిస్తాయి.


అతిపెద్ద స్థాయిలో అర్థం కాని రీతిలో పొందు పరచిన పద్దు, ఇతర ఖర్చులు... అంటే చిల్లర ఖర్చులు. ఈ చిల్లర ఖర్చులకు రెండేళ్ళలో 3,44,00,000/- అంటే నెలకు 14,00,000/- చిల్లర ఖర్చులు. ఇదెంత విడ్డూరం...? నెలకు 14లక్షలు చిల్లర ఖర్చులా...? ఇది సేవా సంస్థా లేక స్వాహా సంస్థా..? ఈ ప్రశ్నలన్నిటికీ రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీతో పాటు సంబంధిత అనుబంధ సంస్థలలో పెత్తనం చేస్తున్న నిర్వాహకులే సమాధానం చెప్పాలి.

ఇక డిపాజిట్ల వ్యవహారాన్ని చూస్తే... రెడ్‌క్రాస్ సంస్థలో 2016-17 ఆర్థిక సంవత్సరానికి ఆ సంస్థ డిపాజిట్లు 679.04 లక్షలపై వడ్డీ రూపంలో వచ్చిన ఆదాయం 171.75 లక్షలు వచ్చినట్లు ఆడిట్ రిపోర్టులో వుంది. 2017-18 ఆర్థిక సంవత్సరం వచ్చేసరికి డిపాజిట్లు 173.70 లక్షలు పెరిగి 852.75 లక్షలకు చేరుకోగా వడ్డీ ఆదాయం మాత్రం కేవలం 60.64 లక్షలు పెరిగింది. ఇక్కడొక విచిత్రం ఏమిటంటే డిపాజిట్లు పెరుగుతుంటే వడ్డీ తగ్గిపోవడం. ఇలా వడ్డీ తగ్గినట్లు ఆడిట్ రిపోర్టులో పేర్కొన్న వైచిత్రి రెడ్‌క్రాస్ సంస్థది కావడం విశేషం. ఆడిట్ రిపోర్టులే ఇలా వచ్చిన వడ్డీని దాచిపెడుతుంటే ప్రజాపయోగ సంస్థల పరిస్థితి ఏమిటో జనమే ఆలోచించాలి.

2018-19 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి డిపాజిట్లు 1027.23లక్షలకు చేరుకోగా వడ్డీని ఆదాయంగా చూపడంలో మరింత వ్యత్యాసానికి చేరి 70.48లక్షలుగా నామమాత్రపు ఆడిట్ రిపోర్టును అందజేశారు.

మామూలుగా బ్యాంకుల్లో గాని, ఇన్‌కంట్యాక్స్ డిపార్టుమెంట్లలోగాని ఇతర సంస్థల్లో రెండు మూడు సంవత్సరాల ఆర్థిక ఆడిట్ రిపోర్టులను పోల్చి చూడడం సహజం. అలా పోల్చి చూసినప్పుడు డిపాజిట్లు పెరిగి వడ్డీలు తరిగిపోయే విచిత్రాన్ని మనం ఈ సంస్థలో చూడవచ్చు.

అంతేకాకుండా 2017-2018 ఒకే ఆర్థిక సంవత్సరంలో రెండు ఆస్థి, అప్పుల పట్టీల్ని(అంటే బ్యాలెన్స్ షీట్స్) వేర్వేరుగా తయారుచేసి అనుయాయులకు ఒక బ్యాలెన్స్ షీట్‌ను ఇవ్వడం, యాజమాన్యానికి మరొకటి సమర్పించడం విశేషం. అకౌంట్స్ మూలాల్లో ఒకే బ్యాలెన్స్ షీటు ఉంటుంది కాని, సంవత్సరానికి రెండో మూడో బ్యాలెన్స్ షీట్లు ఉండి వేర్వేరుగా అంకెలతో ఆడిట్ రిపోర్టులు ఉండడం ఆర్థిక నేరం క్రిందకు వస్తుంది. 2019 డిసెంబర్ 8న జరిగిన వార్షిక సమావేశానికి, మళ్ళీ జనవరి 5, 2020న జరిగిన వార్షిక సమావేశానికి మధ్యలో బ్యాలెన్స్ షీట్స్‌ని మార్చేశారంటే... ఈ ఆర్థిక నేరగాళ్ల చేతివాటం ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు.





2019 డిసెంబర్ 8న సమర్పించిన ఆడిట్ రిపోర్టుకి 2020 జనవరి 5న సమర్పించిన ఆడిట్ రిపోర్టుకు స్పష్టమైన తేడాను పైన గమనించొచ్చు.

**ఈ హడావుడి ఎన్నికలు ఎందుకు?**

అసలు జిల్లా అధికారులు ఈ వ్యవహారంలో లోతుగా దర్యాప్తు చేయకుండా ఒత్తిడులకు తలొగ్గి ఎన్నికల ప్రక్రియకు ఎందుకు శ్రీకారం చుట్టారో అర్థం కావడం లేదు.

గతంలో నెల్లూరులో వుంటూ ప్రస్తుతం చెన్నైలో శాశ్వత నివాసిగా వుంటున్న ఓ వ్యాపారవేత్త ఈ లావాదేవీలన్నిటికీ సూత్రధారిగా కొంతమంది రెడ్‌క్రాస్ సభ్యులు చెప్తున్నారు. ఆయన చేసిన అనేక వ్యాపారాలు కలిసి రాకపోవడంతో చివరకు సేవ ముసుగులో రెడ్‌క్రాస్‌లో తిష్టవేసి వ్యాపారాలలో తన కొచ్చిన నష్టాన్ని ఈ విధంగా పూడ్చుకునే పనిలో పడ్డాడన్నది వారి అభిప్రాయం.

గత నాలుగేళ్ళుగా తన సహచర బృందంతో కలిసి పనిచేసి దొంగే దొంగల్ని దొంగ... దొంగ... అన్నట్లుగా తనతో పాటు పనిచేసివారికి వ్యతిరేకంగా క్లీన్‌చిట్ వున్న కొత్త వ్యక్తులను ప్యానెల్‌లో చేర్చుకుని మళ్ళీ పోటీకి సిద్ధమయ్యాడు. ప్రముఖులతో తనకున్న స్నేహబంధాన్ని రాజకీయ నేతలతో తనకున్న పలుకుబడిని ఈ ఎన్నికల కోసం ఆయన వాడుకుంటున్నాడని రెడ్‌క్రాస్ సభ్యులే అభిప్రాయపడుతున్నారు.




2017-18, 2018-19 సంవత్సరాలకు సంబంధించి సమర్పించిన జమాఖర్చుల పట్టీకలో చిల్లర ఖర్చుల కోసం పెట్టిన మొత్తాన్ని స్పష్టంగా గమనించవచ్చు.

**అందరూ ఆ కోవకు చెందినవారు కాదు**

రెడ్‌క్రాస్‌లో పూర్తిగా సేవాదృక్పథంతో చేరినవారు కూడా మేనేజింగ్ కమిటీలో వున్నారు. అయితే, ఈ స్కామ్ వీరులు తమ మాయమాటలతో మోసపూరిత చేష్టలతో వారిని కూడా బుట్టలో వేసుకుని, తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఇద్దరో ముగ్గురో చేస్తున్న ఈ దారుణాల వల్ల మిగిలినవారికి కూడా మచ్చ ఏర్పడే పరిస్థితి కలుగుతోంది.

**యువతకు అవకాశాలివ్వాలి**

నేటి సమాజంలో సేవారంగంలో తమ వంతు సహాయసహకారాలు అందించడానికి ఎంతోమంది ఔత్సాహిక యువత సిద్ధంగా వున్నారు. అలాంటివారిని రెడ్‌క్రాస్ దరిదాపులకు కూడా రానీయకుండా ఈ వృద్ధ జంబూకాలు తామే ఆధిపత్యం చెలాయించాలనే దురాలోచనతో పావులు కదుపుతున్నాయి.

**సమాచారం ఇవ్వడం లేదు**

సమాచార హక్కు చట్టం క్రింద ఈ సంస్థలలో జరిగే దారుణాలను ప్రశ్నించి సమాచారం సేకరించే ప్రయత్నం చేసిన వారికి కూడా వీరు సహకరించడం లేదు. రెడ్‌క్రాస్ సంస్థలు సమాచార హక్కు చట్టం క్రిందకు రావనే సమాధానం చెప్పి తప్పించుకుంటున్నారు. గతంలో ఇక్కడ జరుగుతున్న అక్రమాలను బయటకు తీయాలని ప్రయత్నించిన భద్రం అనే వ్యక్తి అనుమానాస్పద మృతి కూడా ఈ వివాదాల్లో భాగమే అని ఇప్పటికీ రెడ్‌క్రాస్ సభ్యులే చెప్పుకోవడం గమనార్హం.

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు, చైతన్యవంతులైన నెల్లూరీయులు మేల్కొని సేవ ముసుగులో ఈ ఆర్థిక మేధావులు చేస్తున్న జిమ్మిక్కులకు తెరదించి నిజానిజాలను ప్రజలు, దాతల ముందు ఆవిష్కరిస్తే సంస్థ గౌరవం నిలబడుతుంది. సేవాలయాలుగా వుండాల్సిన రెడ్‌క్రాస్ మరియు అనుబంధ సంస్థలను స్వాహా కేంద్రాలుగా మార్చి తమ పబ్బం గడుపుకుంటున్నవారిని ఇలాంటి సంస్థలకు దూరంగా వుంచితే మంచిది.!




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com